VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం 14.07.2026

సంపుటి : 09 సంచిక : 35 , పేజీలు : 12 , వెలరూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



2

పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

# రాష్ట్ర విశాల ప్రయోజనాల సాధనే లక్ష్యంగా పని చేయాలి...







- ప్రాజెక్టులు, రవాణా వసతులకు అవసరమైన అనుమతులు సాధించాలి
- ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేయండి
- పార్టీలకు అతీతంగా అవసరమైన సమాచారం అందజేస్తాం
- ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు జూలై 13:

తెలంగాణ రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో కలిసి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం కోరారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎంపీలకు మహాత్మాజ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ జనాభాలో 10 శాతం జనాభా ఆరు మహా నగరాల్లో ఉందని, అయితే ఈ నగరాలు 25 శాతం జీడీపీ కలిగి ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరమని... ఎంపీలు ఈ విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఐఐఎం మంజూరుకు విజ్ఞప్తి చేయాలని సీఎం సూచించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–I స్వాధీనం, మెట్రో ఫేజ్–II విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని సీఎం ఎంపీలకు వివరించారు. ఇందుకు సంబంధించి SBICAPSని కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని ఎంపీలకు సీఎం సూచించారు.

▶ మిగతా 11లో

## తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బోనాల ఉత్సవాలు

ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం

- బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయం
- జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్‌దర్వాజా వరకు బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు
- బోనాల ఉత్సవాల నిమిత్తం 3427 దేవాలయాలకు 15 కోట్ల 5 లక్షల




11

## పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత తప్పనిసరి..

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- అస్సాంకు చెందిన 27 మందికి ఊరట కల్పించిన అత్యున్నత న్యాయస్థానం



6

## ఎల్‌నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం సర్వసన్నద్ధం

- ఎల్-నినో పరిస్థితులతో రైతు నష్టపోకుండా మూడు దశల ముందస్తు కార్యాచరణలో మొదటి దశ కార్యాచరణ అమలుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశం.
- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల
- శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలను రైతులకు తెలియజేసి, రైతులు క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేసే విధంగా చూడాలి.
- కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి
- వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై మండలాల వారీగా వారపు బులెటిన్ విడుదల చేయాలి.




- 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, వెలుతురు జూలై 13:

వానాకాలం–2026లో ఎల్–నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ (ICRISAT)లో భారత వాతావరణ శాఖ (IMD), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

▶ మిగతా 2లో

## పైసలు లేవంటూనే లక్షల కోట్ల ప్రాజెక్టులా?

- ప్రభుత్వ ప్రాధాన్యతలపై హరీశ్‌రావు ధ్వజం
- మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీపై భారీ వ్యయాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి
- సంక్షేమానికి నిధులు లేవని చెప్పడం విరుద్ధమని విమర్శలు



11

- ఫుట్‌బాల్ టోర్నీల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేయడం సమంజసం కాదన్న హరీశ్
- అదే నిధులతో పాఠశాలలు, కళాశాలలు నిర్మించవచ్చని సూచన
- పక్క రాష్ట్రాల ఎన్నికలకు ప్రభుత్వ సొమ్ముతో ప్రకటనలంటూ ఆరోపణ
- రైతుబంధు పంపిణీని కూడా ప్రచార కార్యక్రమంగా మార్చేశారని విమర్శ
- ఖమ్మం సభ కోసం వేల బస్సులు నడిపి భారీగా ఖర్చు చేశారన్న వ్యాఖ్యలు
- ప్రజాధనాన్ని ప్రచార కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని ఆరోపణ
- ఖజానా ఖాళీగా ఉందనే ప్రభుత్వ వాదనను ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత


## మంచిరేవులలో కుటుంబ సమేతంగా శ్రీ మచిలేశ్వర స్వామి – వీరభద్ర స్వామి ఆలయాన్ని దర్శించిన టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్ వెలుతురు జూలై 13:

మంచిరేవులలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మచిలేశ్వర స్వామి – వీరభద్ర స్వామి ఆలయాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. మహేష్ కుమార్ గౌడ్ గారు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని శ్రీ మచిలేశ్వర స్వామి, వీరభద్ర స్వామిని ప్రార్థించారు.ఆలయానికి విచ్చేసిన భక్తులు మహేష్ కుమార్ గౌడ్ గారిని ఆత్మీయంగా పలకరించగా, ఆయన అందరితో కలిసి స్వామివారి దర్శనం చేసుకుని కొద్దిసేపు ఆలయ ప్రాంగణంలో గడిపారు.

### రామాలయ విరాళాల చోరీపై సిట్ నివేదిక ఇవ్వాలి



2

- కేంద్రం, యూపీకి సుప్రీంకోర్టు నోటీసులు
- అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ
- దర్యాప్తు పురోగతిపై పూర్తి నివేదిక సమర్పించాలని సిట్‌కు ఆదేశం

### సింగరేణిని బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకున్నాయి

- నైనీ కోల్‌బ్లాక్ ఇచ్చిన మోదీకి కృతజ్ఞతలు: కిషన్‌రెడ్డి
- కొత్తగూడెంలో బీజేపీ సింగరేణి భరోసా యాత్రలో కేంద్రమంత్రి ప్రసంగం
- నైనీ కోల్‌బ్లాక్ కేటాయించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు



2

- వేలం లేకుండా తాడిచర్ల-2 బ్లాక్ కేటాయింపు చారిత్రక నిర్ణయమని వ్యాఖ్య

### తెలంగాణ క్రికెట్‌కు టీజీ20 కొత్త ఊపు




2

- వేలం లేకుండా తాడిచర్ల-2 బ్లాక్ కేటాయింపు చారిత్రక నిర్ణయమని వ్యాఖ్య
- సింగరేణికి అండగా నిలిచిందే మోదీ ప్రభుత్వమని వెల్లడి

### రూ.573 కోట్లతో మహబూబ్‌నగర్ రోడ్ల అభివృద్ధికి శ్రీకారం

- మక్తల్‌లో హెచ్ఏఎం విధానంలో రహదారి పనులకు శంకుస్థాపన
- గ్రామీణ–పట్టణ అనుసంధానానికి పెద్దపీట..




2

# రూ.573 కోట్లతో మహబూబ్‌నగర్ రోడ్ల అభివృద్ధికి శ్రీకారం

- రవాణా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది
- నాణ్యమైన మౌలిక వసతులతో తెలంగాణ అభివృద్ధికి మరింత వేగం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- మహబూబ్‌నగర్ జిల్లా వెలుతురు జూలై 13:

మహబూబ్‌నగర్ జిల్లా మౌలిక వసతుల అభివృద్ధిలో మరో కీలక అడుగు పడింది. జిల్లా ప్యాకేజ్-1లో భాగంగా జిల్లావ్యాప్తంగా రూ.573 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారుల అభివృద్ధి పనులకు మక్తల్ నియోజకవర్గంలో రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) విధానంలో నిర్మించనున్న ఈ రహదారులు జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి. నాణ్యమైన, మన్నికైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, రహదారులు ఏ ప్రాంతానికైనా అభివృద్ధికి పునాది వంటివని అన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్యం వంటి అన్ని రంగాల అభివృద్ధికి మెరుగైన రవాణా వ్యవస్థ కీలకమని పేర్కొన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, విస్తరణ, ఆధునీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని చెప్పారు.మహబూబ్‌నగర్ జిల్లా ప్యాకేజ్-1 కింద చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా అనేక ప్రధాన రహదారులు ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి కానున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి మండల, జిల్లా కేంద్రాలకు వేగవంతమైన రవాణా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. దీంతో ప్రజల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా అత్యవసర సేవలు కూడా మరింత సమర్థంగా అందుతాయని వివరించారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) ద్వారా నిర్మాణం చేపట్టడం వల్ల నాణ్యతతో పాటు నిర్వహణకు కూడా ప్రాధాన్యం లభిస్తుందని మంత్రి తెలిపారు. ఈ విధానంలో ప్రభుత్వం, నిర్మాణ సంస్థలు భాగస్వామ్యంతో ప్రాజెక్టులు అమలవుతాయని, రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను నిర్మాణ సంస్థలే చేపడతాయని వివరించారు. దీంతో నాణ్యతలో రాజీ ఉండదని, ప్రజలకు దీర్ఘకాలం మన్నికైన రహదారులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.మహబూబ్‌నగర్ వంటి విస్తారమైన జిల్లాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు అభివృద్ధికి కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు రవాణా సమస్యలు ఎదుర్కొంటున్న అనేక గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా మెరుగైన అనుసంధానం లభిస్తుందని చెప్పారు. జిల్లా కేంద్రం, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని వివరించారు.వ్యవసాయ రంగానికి ఈ రహదారులు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి అన్నారు. రైతులు పండించిన ధాన్యం, పత్తి, మిర్చి, పండ్లు, కూరగాయలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డులు, గోదాములు, ప్రాసెసింగ్ కేంద్రాలకు తక్కువ సమయంలో తరలించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రవాణా ఖర్చులు తగ్గడంతో రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు ఊతమివ్వనుందని మంత్రి చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు రవాణా, తయారైన ఉత్పత్తుల పంపిణీ వేగవంతం కావడంతో కొత్త పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు.నాణ్యమైన రహదారులు విద్యా, వైద్య రంగాల అభివృద్ధికీ తోడ్పడతాయని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సులభంగా చేరుకోగలరని, అత్యవసర వైద్య సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు వంటి అత్యవసర సేవలకు కూడా ఈ రహదారులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రహదారులు, వంతెనలు, తాగునీటి పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి పనులు వంటి అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజాధనం ప్రతి రూపాయి ప్రజలకు శాశత ప్రయోజనం చేకూరేలా వినియోగిస్తున్నామని తెలిపారు.రూ.573 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ రహదారి ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా రవాణా వ్యవస్థలో గణనీయమైన మార్పు కనిపించనుందని అధికారులు భావిస్తున్నారు. నాణ్యమైన, విశాలమైన రహదారుల ద్వారా గ్రామీణ–పట్టణ అనుసంధానం మరింత బలోపేతమై, జిల్లాలో సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించే అవకాశముంది.ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ క్రికెట్‌కు టీజీ20 కొత్త ఊపు

- ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో పోటీపడ్డారని ప్రశంస
- గ్రామీణ యువతకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని వ్యాఖ్య
- హైదరాబాద్ ఈ-చాంపియన్స్ జట్టుకు అభినందనలు
- ఖమ్మం ఏసెస్ జట్టు పోరాట పటిమ ప్రశంసనీయం
- రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి టీజీ20 దోహదపడుతుందని ఆశాభావం




హైదరాబాద్ వెలుతురు జూలై 13:

తెలంగాణలో క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చిన టీజీ20 సీజన్-1 విజయవంతంగా ముగియడం ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసే దిశగా ఇలాంటి టోర్నీలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.టోర్నీని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు, సహకరించిన స్పాన్సర్లకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అన్ని జట్ల ఆటగాళ్లు, కోచ్‌లు, సపోర్టింగ్ స్టాఫ్ క్రీడాస్ఫూర్తితో వ్యవహరించి టోర్నీ విజయానికి తోడ్పడ్డారని కొనియాడారు.గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువ ప్రతిభను గుర్తించి వారికి తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించడంలో ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో క్రికెట్‌తో పాటు అన్ని క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, యువ క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.టీజీ20 సీజన్-1 ఫైనల్‌లో ఉత్కంఠభరిత పోరులో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ–చాంపియన్స్ జట్టుకు భట్టి విక్రమార్క ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం ఏసెస్ జట్టు కూడా చివరి వరకు అద్భుతమైన పోరాట పటిమ కనబరిచిందని ప్రశంసించారు. విజేతలు, రన్నరప్ జట్లతో పాటు టోర్నీలో పాల్గొన్న అన్ని జట్లకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్రంలో ఇలాంటి క్రీడా పోటీలు మరిన్ని నిర్వహించడం ద్వారా యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరగడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులు తెలంగాణ నుంచి మరింతగా ఎదిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# దేవాదుల పనులకు రూ. 146 కోట్లు విడుదల: భట్టి విక్రమార్క

- పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్ వెలుతురు జూలై 13:

గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో నిపుణులు, ఇంజనీర్ల సూచనలను పక్కనబెట్టి ఏకపక్ష నిర్ణయాలతో ముందుకెళ్లడం వల్లే కాళేశ్వరం బ్యారేజీలు నిర్మాణం పూర్తయిన కొద్ది కాలంలోనే దెబ్బతిన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్టులను నిర్లక్ష్యంగా నిర్వహించి, ఇప్పుడు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు.వాదుల ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతులు, పెండింగ్ పనుల కోసం తక్షణమే రూ.146 కోట్లను విడుదల చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని చెప్పారు.ప్రస్తుత ప్రభుత్వం ప్రతి నిర్ణయాన్ని నిపుణుల సాంకేతిక సూచనలు, ఇంజనీర్ల సిఫార్సుల ఆధారంగానే తీసుకుంటోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ చేపడుతున్నామని పేర్కొన్నారు.రాష్ట్రానికి అత్యంత కీలకమైన దేవాదుల, సీతారామ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. <

గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడంతో పాటు ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రజాధనం ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# రామాలయ విరాళాల చోరీపై సిట్ నివేదిక ఇవ్వాలి

అయోధ్య వెలుతురు జూలై 13:

అయోధ్యలోని రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేసు దర్యాప్తు చేపడుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటివరకు చేసిన విచారణకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించింది. అలాగే దర్యాప్తు బృందంలో ఉన్న సభ్యుల వివరాలు, వారి బాధ్యతలు కూడా నివేదికలో పొందుపరచాలని స్పష్టం చేసింది. ఈ కేసులో సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లను విచారణకు స్వీకరించిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, అలాగే ఆలయ నిర్వహణను పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు నోటీసులు జారీ చేసింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ప్రజల్లో ఆందోళనకు కారణమయ్యాయని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు ఎంతవరకు పురోగమించిందో తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది. దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందా? ఇందులో భాగమైన అధికారులు ఎవరెవరు? వంటి వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని పేర్కొంది.

ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, దర్యాప్తు కొనసాగుతోందని, స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. దర్యాప్తు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నివేదికను బహిరంగంగా వెల్లడించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే పిటిషనర్ల తరపు న్యాయవాదులు ఆ నివేదిక ప్రతిని తమకు కూడా అందించాలని కోరారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన మెహతాకు ధర్మాసనం స్పందిస్తూ, "మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారు" అని వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను జులై 20వ తేదీకి వాయిదా వేసింది.అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.

# సింగరేణికి అండగా నిలిచిందే మోదీ ప్రభుత్వమని వెల్లడి

- సింగరేణిని బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకున్నాయని ఆరోపణలు
- అక్రమంగా కేటాయించిన గనులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని వ్యాఖ్య
- కార్మికుల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని మండిపాటు
- మెస్సీతో ఫుట్‌బాల్ కోసం సింగరేణి డబ్బులు ఖర్చు చేస్తారా? అంటూ ప్రశ్న
- సింగరేణిని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని కేసీఆర్‌పై విమర్శలు
- సింగరేణి వ్యవహారాల్లో కేంద్రానికి పెత్తనం ఉండదని స్పష్టం

కొత్తగూడెం వెలుతురు జూలై 13:

ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణి సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సంస్థకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు.ఇప్పటివరకు దేశంలో బొగ్గు గనులను ప్రధానంగా వేలం ద్వారానే కేటాయిస్తూ వచ్చారని కిషన్‌రెడ్డి తెలిపారు. అయితే సింగరేణి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ప్రత్యేక చొరవతో వేలం లేకుండా తాడిచర్ల-2 కోల్‌బ్లాక్‌ను కేటాయించారని చెప్పారు. అలాగే ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్‌ను కూడా సింగరేణికి ఇవ్వడం కేంద్ర ప్రభుత్వం సంస్థ పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.సింగరేణి ప్రస్తుత పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రెండు పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో సంస్థను అభివృద్ధి చేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని విమర్శించారు. గతంలో డబ్బులు తీసుకుని బొగ్గు గనులు కేటాయించారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ హయాంలో అక్రమంగా కేటాయించిన గనులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. <

బొగ్గు గనుల కేటాయింపులో పూర్తి పారదర్శకత ఉండాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు.సింగరేణి కార్మికుల కష్టార్జిత సంపదను పాలకులు దోచుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. సంస్థలో బొగ్గు నిల్వలు తగ్గిపోయాయని చెబుతూ కేటీఆర్, హరీశ్‌రావు కేంద్రానికి లేఖలు రాశారని, కానీ సింగరేణి వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఏమిటో వారికి తెలియదా అని ప్రశ్నించారు.

సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? ప్రజల సొమ్మును ఇలాంటి కార్యక్రమాలకు వెచ్చించడం సమంజసమేనా? అంటూ కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. సింగరేణిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేశారని, సంస్థ నిధులను ప్రజా ప్రయోజనాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించారని ఆరోపించారు.

పదేళ్లపాటు కేసీఆర్ సింగరేణిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని కిషన్‌రెడ్డి విమర్శించారు. సంస్థ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్ సింగరేణికి దక్కినప్పుడు మాత్రం కేసీఆర్ స్పందించలేదని వ్యాఖ్యానించారు.

సింగరేణిలో ఏ సమస్య వచ్చినా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా రాజకీయ విమర్శలు చేయడం సరైంది కాదని కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణి సంస్థపై కేంద్రానికి ప్రత్యక్ష పెత్తనం ఉండదని, సంస్థ పరిపాలన రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతోనే సాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

# ఎల్‌నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం సర్వసన్నద్ధం

, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్ (IIOR), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (IIMR), సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ (CRIDA) శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను ఈ సమావేశంలో సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు.ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునేవిధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధరంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ గారు.. ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం, మధ్యలో దీర్ఘకాలిక పొడి పరిస్థితులు (Dry Spells), అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు.ఆ తరువాత మాట్లాడిన ఇరిగేషన్ శాఖ , భూగర్భజలశాఖ, మరియు మిగతాశాఖ అధికారులు మంత్రిగారికి నీటిలభ్యత వివరాలు మరియు విద్యుత్ సరఫరాకు సంబంధించిన రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం రోజువారీగా సమీక్షించాలని మంత్రి తెలిపారు. ప్రస్తుత నివేదిక ప్రకారం 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 20 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందన్నారు. వర్షాభావ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాల్సిందిగా సూచించారు.శాస్త్రీయ విధానాలతో ఎల్-నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి రాష్ట్రంలో Dynamic District Specific Response (DSR) విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు. ఇందులో భాగంగా నిజ సమయ వర్షపాతం పర్యవేక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు, నేల తేమ పర్యవేక్షణ, పంటల ఎదుగుదల అంచనా, వాతావరణ ప్రమాద విశ్లేషణ, ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళిక, పొలంలోనే నేల తేమ సంరక్షణ చర్యలు, పంటల వైవిధ్యీకరణ వంటి శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని ఆదేశించారు.వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై మండలాల వారీగా వారపు బులెటిన్

ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఇన్‌ఫ్లోలు, సాగునీటి లభ్యతపై ఖచ్చితమైన అంచనాలను కూడా బులెటిన్‌లో పొందుపరచాలని మంత్రి స్పష్టం చేశారు. భూగర్భ జలాల శాఖ మండలాల వారీగా భూగర్భ జలాల లభ్యతపై తాజా సమాచారాన్ని అందించి, నీటి వినియోగ ప్రణాళికను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వారపు బులెటిన్‌ను రైతు వేదికలు, గ్రామపంచాయతీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికలు, డిజిటల్ ప్లాట్‌ఫారాలు, స్థానిక మీడియా ద్వారా విస్తృతంగా రైతులకు చేరవేయాలని, రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సమాచారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలను అమలు చేయాలి

ఇక్రిశాట్‌లో జరిగిన సమీక్షలో శాస్త్రవేత్తలు వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభమవడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక సూచనలు చేశారు. వర్షపాతం నమోదై భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో (BBF) లేదా రిడ్జ్ అండ్ ఫరో పద్ధతులను అనుసరించాలని, భూమిలో తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని, నేల తేమను కాపాడేందుకు తరచూ ఇంటర్ కల్టివేషన్ చేపట్టాలని, వర్షాలు కురిసిన తర్వాత మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో నత్రజని, పొటాష్ ఎరువులు వేయాలని శాస్త్రవేత్తలు సూచించారు.అలాగే పంటల కీలక ఎదుగుదల దశల్లో ప్రాణాధార నీటిపారుదల అందించడం, వరుస పంటల్లో స్కిప్ రో ఇరిగేషన్ అమలు చేయడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ($KNO_3$) ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయడం, ప్రతి 3.6 మీటర్లకు ఒక డెడ్ ఫరో ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించడం, వ్యవసాయ కుంటల్లో నిల్వ చేసిన నీటిని అవసరమైన సమయంలో వినియోగించడం, అంతర పంటలను ప్రోత్సహించడం, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను తప్పనిసరిగా పాటించాలని శాస్త్రవేత్తలు సూచించారని మంత్రి తెలిపారు.ఈ సూచనలన్నింటినీ రైతులకు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో చేరవేసి, అమలయ్యేలా జిల్లా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు.


## వరి రైతులకు ప్రత్యేక సూచనలు

శాస్త్రవేత్తలు సూచించనట్టుగా.. ప్రస్తుతం వరి పంట నారుమడి దశలో ఉన్న రైతులు నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరానికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3CG గ్రాన్యూల్స్ వేయాలని, నాటే సమయంలో నారు ఆకుల చివరలను కత్తిరించి నాటాలని, 15×10 సెంటీమీటర్ల దూరంతో దగ్గరగా నాటి ప్రతి గుంతలో 6–8 మొక్కలు ఉంచాలని, సిఫార్సు చేసిన మోతాదుతో పోలిస్తే 25 శాతం అదనపు నత్రజని ఇవ్వాలని, మొత్తం నత్రజనిలో 70 శాతం నాటే సమయంలో, మిగిలిన 30 శాతం పూత ప్రారంభ దశలో వేయాలని మంత్రి అన్నారు.

# దేశ ప్రజల దృష్టిని మరల్చే కుట్ర బీజేపీ చేస్తోందా? : పి. ప్రసన్న కుమార్ శర్మ

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

జగద్గురు శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి గారు అయోధ్య శ్రీరామ మందిర నిర్మాణం, విరాళాల వినియోగంపై చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో పాటు, "మేమే హిందూ ధర్మ రక్షకులం" అని చెప్పుకునే భారతీయ జనతా పార్టీ నాయకులందరూ దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని ఆచరించే కోట్లాది మంది భక్తులు తమ కష్టార్జిత సంపాదనను, చమటోడ్చి సంపాదించిన ప్రతి రూపాయిని శ్రీరామచంద్రుని ఆలయ నిర్మాణం కోసం విరాళంగా అందించారని తెలిపారు. సామాన్య భక్తుడి నుంచి దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తల వరకు అందరూ విశ్వాసంతో ఇచ్చిన విరాళాల వినియోగంపై ఇప్పుడు సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.జగద్గురు అవిముక్తేశ్వరానంద సరస్వతి గారు "రామాలయం కాకుండా కారిడార్ నిర్మించారని, ఢిల్లీలో మాత్రం భారతీయ జనతా పార్టీ తన కార్యాలయాన్ని తీర్థక్షేత్రంలా తీర్చిదిద్దుకుందని" చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయని పేర్కొన్నారు. అలాంటి తీవ్రమైన వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం పాటిస్తోందని ప్రశ్నించారు.రామమందిర నిర్మాణం పేరుతో గత నాలుగు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా ఎంత మొత్తం విరాళాలు సేకరించారు? వాటిలో ఎంత మొత్తం నిర్మాణానికి ఖర్చు చేశారు? భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్ర వైడూర్యాలు, విదేశీ కరెన్సీ, డాలర్లు, పౌండ్లు తదితర ఆస్తుల మొత్తం విలువ ఎంత? వాటి లెక్కలు ఎక్కడ ఉన్నాయి? అని ఆయన ప్రశ్నించారు.దేశంలో సుమారు 145 కోట్ల జనాభాలో కనీసం 100 కోట్ల మందికి పైగా రామాలయం కోసం ఏదో ఒక రూపంలో విరాళాలు అందించారని, ఆ లెక్క ప్రకారం నగదు రూపంలోనే వేల కోట్ల రూపాయలు సమీకరించబడినట్లు అంచనా వేయవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాంటప్పుడు ఇప్పటివరకు పూర్తి స్థాయి లెక్కలు ప్రజలకు వెల్లడించకపోవడం అత్యంత విచారకరమని అన్నారు.ఒక సాధారణ వ్యక్తి చిన్న పొరపాటు చేసినా లేదా ప్రభుత్వాన్ని ప్రశ్నించినా వెంటనే ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను రంగంలోకి దింపే కేంద్ర ప్రభుత్వం, దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఈ ఆరోపణలపై మాత్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ఈ అంశంపై పారదర్శక విచారణ జరిపి, విరాళాల సేకరణ, వినియోగంపై పూర్తి వివరాలను దేశ ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. నిజమైన సనాతన ధర్మాన్ని విశ్వసించే కోట్లాది మంది భక్తులు ఈ ప్రశ్నలకు సమాధానం కోరుకుంటున్నారని పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.రామజన్మభూమి ట్రస్ట్ ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేసి, సుప్రీంకోర్టు



న్యాయమూర్తి ఆధ్వర్యంలో నిష్పక్షపాత విచారణ జరిపించాలి: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ సనాతన ధర్మం ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొన్న ప్రతిసారి ఆదిశంకరాచార్యులు అవతరించి ధర్మ పునరుద్ధరణకు కృషి చేశారని, దేశవ్యాప్తంగా తర్క, మీమాంసా శాస్త్రాల ద్వారా వివిధ మత సిద్ధాంతాలను ఎదుర్కొని సనాతన ధర్మ వైభవాన్ని చాటారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు. చతురామ్నాయ పీఠాల ప్రాముఖ్యత భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో అత్యున్నత స్థానంలో ఉందని ఆయన అన్నారు.అలాంటి చతురామ్నాయ పీఠాలలో ఒక పీఠానికి చెందిన జగద్గురువు చేసిన వ్యాఖ్యలను పట్టించుకోకుండా, ఆయనపై వివిధ కేసులు నమోదు చేయడం విచారకరమని అన్నారు. తామే నిజమైన హిందువులమని చెప్పుకునే భారతీయ జనతా పార్టీ నాయకత్వం, సనాతన ధర్మ విలువలను విస్మరించి, రాముని పేరుతో ప్రజల నుంచి సేకరించిన నిధుల వినియోగంపై దేశవ్యాప్తంగా అనుమానాలు తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు.దేశం, ధర్మం పేరుతో మాట్లాడే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటివరకు ఈ అంశంపై స్పందించకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. భారతదేశం కుల, మత విద్వేషాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని అభివృద్ధి దిశగా సాగాల్సిన సమయంలో, భగవంతుని పేరుతో ఓట్లు అడిగి, అనంతరం అదే పేరుతో సేకరించిన నిధులపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా, బాధ్యులను కాపాడే ప్రయత్నాలు ఎంతకాలం కొనసాగుతాయని ఆయన ప్రశ్నించారు.శ్రీరామ జన్మభూమి ట్రస్ట్‌పై వస్తున్న ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు దేశంలో ఇతర అంశాలను తెరపైకి తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో రామజన్మభూమి ట్రస్ట్‌కు సంబంధించిన అన్ని ఆర్థిక లావాదేవీలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని, అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు భాగస్వామ్యంతో కూడిన నిష్పక్షపాత విచారణ కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దాతలు సమర్పించిన ప్రతి రూపాయి వినియోగంపై పూర్తి పారదర్శకత తీసుకురావాలని, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న విమర్శలకు స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకించలేదని, రాముడి పేరుతో రాజకీయ లబ్ధి పొందకూడదని మాత్రమే చెప్పిందని ప్రసన్న కుమార్ శర్మ స్పష్టం చేశారు. రామాలయ నిర్మాణానికి భక్తులు సమర్పించిన విరాళాల వినియోగంపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందని అన్నారు.అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్య రాజకీయ విభేదాలపై ప్రజల్లో వివిధ రకాల చర్చలు జరుగుతున్నాయని, అలాంటి ఊహాగానాలకు తెరదించాలంటే ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి, పారదర్శక విచారణ నిర్వహించాలని ఆయన కోరారు అమిత్ షా–యోగి ఆదిత్యనాథ్ మధ్య ఆధిపత్య పోరుపై వస్తున్న కథనాలపై సమగ్ర విచారణ జరగాలి: పి. ప్రసన్న కుమార్ శర్మ భారతీయ జనతా పార్టీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తర్వాత రెండో స్థానంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్య అంతర్గత ఆధిపత్య పోరు జరుగుతోందనే చర్చలు గత కొన్ని నెలలుగా వివిధ రాజకీయ వర్గాలు, మీడియా కథనాలు, సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ విశ్లేషణల్లో వినిపిస్తున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.గత ఆరు నెలలుగా దేశంలో చోటుచేసుకున్న పలు రాజకీయ పరిణామాలు, కొన్ని పత్రికల్లో వచ్చిన విశ్లేషణలు, ఎలక్ట్రానిక్ మీడియా కథనాలను పరిశీలిస్తే, ఈ తరహా చర్చలు ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ జరుగుతున్నాయనే అభిప్రాయం కలుగుతోందని ఆయన అన్నారు. అయితే, ఈ ప్రచారంలో ఎంతవరకు వాస్తవం ఉందో సంబంధిత పక్షాలే స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అయోధ్య శ్రీరామ జన్మభూమి క్షేత్రానికి సంబంధించిన ఆర్థిక అవకతవకల ఆరోపణలు, ట్రస్టు నిర్వహణపై వ్యక్తమవుతున్న సందేహాలు కూడా ఈ అంతర్గత రాజకీయ పోటీ నేపథ్యంలోనే వెలుగులోకి వచ్చాయనే ప్రచారం జరుగుతోందని, ఈ ప్రచారంలో నిజానిజాలు ఏమిటో సమగ్ర విచారణ ద్వారానే తేలాలని ఆయన అభిప్రాయపడ్డారు.శ్రీరాముడి పేరు, సనాతన ధర్మం వంటి పవిత్రమైన అంశాలు రాజకీయ ఆధిపత్య పోరుకు బలికావడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. సనాతన ధర్మాన్ని నిజాయితీగా ఆచరించే భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ఎలాంటి పరిణామాలూ జరగకూడదని పేర్కొన్నారు.ఈ అంశంపై దేశంలోని మేధావులు, పీఠాధిపతులు, సన్యాసులు, నాగ సాధువులు, సనాతన ధర్మాన్ని ఆదరించే ప్రతి ఒక్కరూ నిష్పాక్షికంగా ఆలోచించి, వాస్తవాలు వెలుగులోకి వచ్చేలా కృషి చేయాలని ఆయన కోరారు.శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్టు నిర్వహణకు సంబంధించిన అన్ని ఆరోపణలపై స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపి నిజానిజాలను దేశ ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్ తరాలకు సనాతన ధర్మంపై ఎలాంటి అనుమానాలు కలగకుండా, శ్రీరాముడి పేరుకు ఎలాంటి మచ్చ రాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలు, ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ, విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, అలాగే శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్టుపై ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ అంశంపై తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించి, వాస్తవాలను దేశ ప్రజల ముందుంచాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పి. ప్రసన్న కుమార్ శర్మ కోరారు.



# పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది

- **కేసీఆర్‌పై ఎంపీ చామల తీవ్ర విమర్శలు**
- **కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు**
- **టికెట్ కోసం కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్‌దేనని విమర్శ**
- **మంత్రి పదవి రాక టీడీపీని వీడారంటూ ఆరోపణ**
- **పార్టీ పెట్టి ఎన్నికలు, కలెక్షన్లు చేశారని వ్యాఖ్యలు**
- **బీఆర్ఎస్‌కు రక్తదాహం, ధనదాహం, అధికార దాహమంటూ విమర్శ**
- **తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం**
- **విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాలకు కారణమయ్యారని ఆరోపణ**
- **కమిషన్లే తప్ప రైతులకు నీళ్లు ఇవ్వలేదని మండిపాటు**
- **బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని వ్యాఖ్య**

**ఈటల గెలుపులో బీఆర్ఎస్ పాత్ర ఉందని ఆరోపణ**

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. టికెట్ కోసం తన కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందంటూ ఎద్దేవా చేశారు. మంత్రి పదవి దక్కలేదనే కారణంతోనే కేసీఆర్ తెలుగుదేశం పార్టీని వీడి బయటకు వచ్చారని ఆరోపించారు.పార్టీ స్థాపించిన తర్వాత తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుని ఎన్నికలు, కలెక్షన్లు చేశారని చామల విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి



రక్తదాహం, ధనదాహం, అధికార దాహం తప్ప ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను తిరస్కరించి ఇంటికే పరిమితం చేశారని వ్యాఖ్యానించారు.తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులను రెచ్చగొట్టి, వారి బలిదానాలకు బీఆర్ఎస్ కారణమైందని ఆరోపించారు. పిట్టకథలు చెప్పి ప్రజలను నమ్మించి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని విమర్శించారు.అధికారంలో ఉన్న పదేళ్లలో కమిషన్లు దండుకోవడం తప్ప రైతులకు సాగునీరు అందించేలా ఒక్క ఎకరానికైనా కొత్తగా నీళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. "పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సెటైర్లు విసిరారు.2009లోనే కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చారని, అంతకుముందు ఉద్యమంలో ఆయన పాత్ర పెద్దగా కనిపించలేదని చామల వ్యాఖ్యానించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను కేసీఆర్ ఎప్పుడూ పట్టించుకోలేదని ఆరోపించారు.బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించడంలో బీఆర్ఎస్ పరోక్షంగా సహకరించిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీల రాజకీయాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన తీర్పు ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

# దాతల సహకారంతో సీకేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ






**వరంగల్, వెలుతురు జూలై 13:**

వరంగల్ నగరంలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దేశ్‌పాండే ఫౌండేషన్, దాతల సహకారంతో రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, దాతలు ఎన్.సి. మూర్తి, జీవన్ మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ జి. పోశయ్య, మాజీ ప్రిన్సిపాల్ ఎ. ధర్మారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమానికి ముందు మంత్రి కొండా సురేఖకు కళాశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. అనంతరం చంద్రకాంతయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనం సమర్పించగా, అతిథులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. యువత నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.అనంతరం దేశ్‌పాండే ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన స్కిల్ ప్లస్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి పరిశీలించారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నెహ్రూ మెమోరియల్ పాఠశాల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు అందించారు.తదుపరి జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపాల్ జి. పోశయ్య, మాజీ ప్రిన్సిపాల్ ఎ. ధర్మారెడ్డి, దాత ఎన్.సి. మూర్తి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మంత్రి కొండా సురేఖ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.దాత ఎన్.సి. మూర్తి మాట్లాడుతూ, ఈ కళాశాలలో చదివి విదేశాల్లో స్థిరపడిన తమలాంటి పూర్వ విద్యార్థులు తమ స్వస్థల అభివృద్ధికి చేయూతనివ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.దాత జీవన్ మూర్తి మాట్లాడుతూ, సమాజానికి తిరిగి సేవ చేయగలగడం గొప్ప అవకాశమన్నారు. యువత నిరుద్యోగంతో బాధపడకుండా, కంప్యూటర్ నైపుణ్యాలు సాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో దేశ్‌పాండే ఫౌండేషన్ ద్వారా ఈ స్కిల్ ప్లస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చివరగా అతిథులు, దాతలను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డైవర్షన్ రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ – కొప్పుల ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధికి పెద్దపీట వేస్తుంటే, ఆ ప్రజాదరణను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ విమర్శించారు.ప్రజలకు మేలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుందనే భయంతో బీఆర్ఎస్ నాయకులు అసలు ప్రజా సమస్యలను పక్కనబెట్టి, ప్రతిరోజూ వార్తల్లో నిలవాలనే ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారని ఆయన అన్నారు.మాజీ ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు, తాను ఆ శాఖకు మంత్రిగా ఉన్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయాలు, నిర్మాణం, వ్యయాలు, నాణ్యత, నిర్వహణ అంశాలపై తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని కొప్పుల ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అంశాలపై ఆత్మపరిశీలన చేసుకోకుండా, ఇప్పుడు సిగ్గు లేకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం రాజకీయ బాధ్యతకు తగిన విధానం కాదని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆయన అన్నారు.తెలంగాణ ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారని, అసత్య ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొంటూ, ప్రజా సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని కొప్పుల ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.హరీష్ రావు గారూ... ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోండి! ఒక్కో ప్రాజెక్టును కమిషన్లకు వేదికగా మార్చి, తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్ నాయకులకు ఈరోజు ప్రజల ముందుకు వచ్చి నీతులు చెప్పే నైతిక హక్కు లేదు.ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వం. తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన పాలనను ప్రజలు మరచిపోలేదు.హరీష్ రావు గారూ, ఇప్పటికైనా వాస్తవాలను అంగీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకోండి. తెలంగాణ ప్రజలు మీ పాలనను ఇప్పటికే తీర్పు చెప్పారు. గత తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకుని బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించండి.ప్రజలు అభివృద్ధి, పారదర్శకత, జవాబుదారీతనం కోరుకుంటున్నారు. అసత్య ప్రచారాలు, నిరాధార విమర్శలను ఇక ప్రజలు నమ్మే పరిస్థితి లేదు కొప్పుల ప్రవీణ్ కుమార్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి .



# ఆడంబరాల ఆకాశం... వాస్తవాల క్షేత్రస్థాయి!

ఆకాశం నిండుగా కారుమబ్బులు కమ్ముకుంటే చాలు, మానవ హృదయం ఆనంద డోలికల్లో తేలుతుంది. త్వరలోనే అమృతం లాంటి వర్షపు జల్లులు కురుస్తాయని, వసుంధర పులకరిస్తుందని ఆశపడటం సహజం. దేశానికి వెన్నెముక అయిన రైతన్న ఆశగా పొలం గట్టుపై నిలబడి, గగన తలం వైపు కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తాడు. చిన్నారులు కాగితపు పడవలు సిద్ధం చేసుకుంటూ, గొడుగుల కోసం ఇల్లంతా వెతుకుతుంటారు. కానీ, కొన్నిసార్లు ఆ నల్లని మేఘాలు బలమైన గాలుల ధాటికి కొట్టుకుపోయి, ఒక్క చినుకు కూడా నేలను తాకకుండానే అంతర్ధానమైపోతాయి. అప్పుడే మనకు ఒక ప్రకృతి సత్యం బోధపడుతుంది .ఆకాశంలో కనిపించే ప్రతి నల్లని మబ్బూ వర్షాన్ని తీసుకురాదు. ఈ చిన్న వాతావరణ మార్పులో మానవ జీవితానికి దిశా నిర్దేశం చేసే ఒక లోతైన జీవన తత్వశాస్త్రం దాగి ఉంది. బాహ్య స్వరూపాలను చూసి అంతర్గత సత్యాన్ని అంచనా వేయలేమనే పాఠాన్ని ఇది మనకు నేర్పుతుంది.

ఆధునిక వాతావరణ శాస్త్రవేత్తల విశ్లేషణల ప్రకారం, అంతరిక్షంలో ఏర్పడే ప్రతి మేఘం వర్షాన్ని కురిపించే సామర్థ్యాన్ని కలిగి ఉండదు. ఒక మేఘం ఘనీభవించి వర్షంగా మారడానికి వాతావరణంలో తగినంత తేమ, నిర్దిష్ట ఉష్ణోగ్రత, పీడన వ్యత్యాసాలు మరియు గాలి దిశ వంటి అనేక భౌతిక ప్రక్రియలు ఒకే సమయంలో అనుకూలించాలి. బాహ్యంగా ఎంతో నల్లగా, సువిశాలంగా కనిపించే మేఘాలు సైతం సరైన అంతర్గత పరిస్థితులు లేకపోతే కేవలం శూన్యంగానే మిగిలిపోతాయి.బాహ్య



ఆడంబరం అనేది తాత్కాలికం, అంతర్గత సత్తా మాత్రమే శాశ్వతమైన ఫలితాన్ని ఇస్తుందని వాతావరణ గమనం నిరూపిస్తుంది.ఈ ప్రకృతి సూత్రం మానవ నిత్య జీవితంలో ప్రతి అడుగులోనూ అన్వయించుకోవచ్చు. నిత్యం ఎదురయ్యే సవాళ్లు, అవకాశాల వెనుక ఇటువంటి కారుమబ్బులు ఎన్నో దాగి ఉంటాయి. ఉదాహరణకు,ఉపాధి అవకాశాలు ఎంతో ప్రతిష్టాత్మకమైనదిగా కనిపించే ఉద్యోగ అవకాశం చివరి నిమిషంలో చేతికందకుండా చేజారి పోవచ్చు.విద్యా రంగం రాత్రింబవళ్లు శ్రమించి, అద్భుతంగా రాశానని భావించిన పరీక్షలో ఆశించిన స్థాయి మార్కులు రాకపోవచ్చు.వ్యాపార రంగం అన్ని రకాల అనుకూలతలు ఉండి, భారీ లాభాలను తెచ్చిపెడుతుందని నమ్మిన ఒప్పందాలు ఆఖరి క్షణంలో రద్దయిపోవచ్చు.

ఇటువంటి ఆకస్మిక పరిణామాలు సంభవించినప్పుడు సామాన్య మానవుడు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురవుతాడు. అయితే, ఇక్కడే మనం వివేకాన్ని ప్రదర్శించాలి. ప్రతి అనుకూల సందర్భమూ విజయ తీరాలకు చేర్చదు, అలాగే ప్రతి ఓటమీ శాశ్వతం కాదనే సత్యాన్ని గ్రహించాలి. మరోవైపు, జీవితంలో భయపెట్టేలా కనిపించే సమస్యలు కూడా అంత భయంకరమైనవి కావు. వైద్య పరీక్షల నివేదికల కోసం వేచి చూసేటప్పుడు మనసు వేయి రకాల నెగటివ్ ఆలోచనలతో నిండిపోతుంది. కానీ తుది ఫలితం సాధారణంగానే ఉండవచ్చు. కుటుంబాల్లో వచ్చే చిన్నపాటి మనస్పర్థలు పెద్ద విపత్తుగా మారుతాయని భయపడతాం, కానీ ఒక చిన్న సంభాషణతో ఆ సమస్యలు మంచులా కరిగిపోతాయి. అంటే, ప్రతి నల్లని మేఘం వినాశనానికి సంకేతం కాదు.ఈ తాత్విక దృక్పథం సామాజిక, రాజకీయ వ్యవస్థలకు సైతం అద్దం పడుతుంది. ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికల సమయం రాగానే రాజకీయ నాయకులు కురిపించే హామీల వర్షం, ఇచ్చే ఆకర్షణీయమైన వాగ్దానాలు ఆకాశంలో కమ్ముకున్న నల్లని మేఘాల వలె ఎంతో ఆశాజనకంగా కనిపిస్తాయి. సమాజంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, పేదరికం తొలగిపోతుందని ప్రజలు ఆశతో ఎదురుచూస్తారు. కానీ, కాలక్రమేణా ఆ వాగ్దానాలు క్షేత్ర స్థాయిలో ఆధారం అమలుకు నోచుకోక, కేవలం ప్రసంగాలకే పరిమితమై, గాలికి కొట్టుకుపోయే మేఘాల్లాగే అదృశ్యమవుతాయి.అలాగే, మార్కెట్లో భారీ ప్రచార ఆర్భాటాలతో వచ్చే పథకాలు, నూతన ప్రాజెక్టుల విషయంలోనూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బాహ్య ఆడంబరాలను చూసి మోసపోకుండా, వాటి వెనుక ఉన్న వాస్తవికతను పరిశీలించే సామాజిక వివేకాన్ని పౌర సమాజం అలవర్చుకోవాలి. కేవలం మాటల గారడీని నమ్మకుండా, ఫలితాలు వచ్చే వరకు సంయమనం పాటించడం అత్యంత అవసరం.ప్రతి మేఘం వర్షాన్ని తీసుకురాదు అనే నగ్న సత్యాన్ని తెలుసుకోవడం వల్ల మనిషి నిరాశావాదిగా మారకూడదు. బదులుగా, ఇది జీవితాన్ని సమతుల్యమైన, వాస్తవిక దృక్పథంతో వీక్షించడానికి ఒక బలమైన పునాదిగా ఉపయోగపడాలి. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి ప్రబోధించిన కర్మ సిద్ధాంతం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఫలితంతో సంబంధం లేకుండా తన వంతు ప్రయత్నంగా దుక్కి దున్నడం, విత్తనాలు చల్లడం వంటి పనులను నిరంతరం కొనసాగించే రైతులాగే, మనం కూడా ప్రయత్నాన్ని నిరంతరం కొనసాగించాలి. ఏది ఆకర్షణీయంగా కనిపించినా తక్షణమే నమ్మేయకుండా, వివేచనతో, తార్కిక ఆలోచనతో అంచనా వేయడం నేర్చుకోవాలి. ఇది జీవితంలో ఎదురయ్యే మోసాల నుండి మనల్ని రక్షిస్తుంది.ఆకాశంలో దట్టమైన నల్లని మేఘాలు ఏర్పడినప్పుడు అవి వర్షాన్ని కురిపించినా, లేదా గాలికి కొట్టుకుపోయినా ఆ కాలచక్రం ముగిసిన తర్వాత అంతరిక్షం మళ్లీ నిర్మలంగా, ప్రశాంతంగా మారుతుంది. మానవ జీవితం కూడా సరిగ్గా అటువంటిదే. ఇక్కడ ఎదురయ్యే ప్రతి సవాలు, ప్రతి వైఫల్యం, ప్రతి గెలుపు లేదా ప్రతి భయం ఏదీ శాశ్వతం కాదు. అవన్నీ కాలప్రవాహంలో వచ్చిపోయే తాత్కాలిక బుడగలు మాత్రమే.మనం చేయాల్సిందల్లా ఒక్కటే, బాహ్య స్వరూపాలను చూసి తొందరపడకుండా, అంతిమ ఫలితంపై అతిగా ఆశలు పెంచుకోకుండా, వర్తమానంలో ప్రశాంత చిత్తంతో మన విధులను నిర్వర్తించడం. అప్పుడే జీవితం అనే ఈ అనంత ఆకాశంలో ఎన్ని కారుమబ్బులు కమ్ముకున్నా, మానసిక స్థిరత్వం అనే నేల ఎప్పుడూ బలమైన పునాదితో వర్ధిల్లుతుంది. చివరగా, వర్షం కురవడం, కురవకపోవడం అనేది ప్రకృతి యొక్క సహజ సిద్ధమైన ధర్మం. కానీ, ఫలితాల సాధ్యాసాధ్యాలతో నిమిత్తం లేకుండా ప్రయత్నించడం మాత్రమే మానవుడి పరమ ధర్మం. ఈ నిజాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించి ఆచరించినవాడే నిజమైన వివేకి అవుతాడు.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# బెంగళూరు క్వారీ: లాభాల వేటలో శ్రామికుల బలి

బెంగళూరు శివార్లలోని తవరేకెర–మాదపట్టణ పరిధిలోని ఒక రాతి క్వారీలో జరిగిన ఘోర దురంతం యావత్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎగువ క్వారీలో యంత్రాలతో బండరాళ్లను తరలిస్తుండగా, ఒక భారీ బండరాయి దొర్లి దిగువ క్వారీలో పనిచేస్తున్న కార్మికులపై పడింది. ఏడుగురు వలస కార్మికులు అక్కడికక్కడే నలిగి ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు, నలుగురు అదృష్టవశాత్తు తప్పించుకున్నారు. బతుకుదెరువు కోసం బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించిన నిరుపేదలు, ఉపాధి కోసం వచ్చిన నేలపైనే శవాలుగా మిగిలిపోయారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్రమాదం కాదు. లాభాలను మానవ ప్రాణాల కంటే గొప్పగా భావించే ఆర్థిక విధానం, చట్టాలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వ యంత్రాంగం, శ్రామికుల పట్ల కొనసాగుతున్న సామాజిక ఉదాసీనత కలిసి సృష్టించిన వ్యవస్థాగత విషాదం.ఈ దురంతాన్ని పరిశీలిస్తే ఐదు ప్రధాన అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. అవి: మొదటిది, లాభమే ఉత్పత్తి ప్రక్రియకు ప్రధాన లక్ష్యంగా మారినప్పుడు శ్రామికుడి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం అన్నీ రెండో స్థానానికి వెళ్లిపోతాయి. భద్రతా ప్రమాణాలను పాటించడం ఉత్పత్తి వ్యయాన్ని పెంచుతుందనే కారణంతో అనేక యాజమాన్యాలు వాటిని నిర్లక్ష్యం చేస్తుంటాయి. బెంగళూరు క్వారీ దురంతం కూడా అదే వాస్తవాన్ని బహిర్గతం చేసింది. కార్మికులకు హెల్మెట్లు, రక్షణ తాళ్లు, ప్రమాద హెచ్చరిక వ్యవస్థలు వంటి కనీస భద్రతా సౌకర్యాలు కూడా కల్పించకపోవడం దీనికి నిదర్శనం.ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కోట్ల రూపాయలు వెచ్చించే యాజమాన్యాలు, శ్రామికుల ప్రాణాలను కాపాడే కనీస ఏర్పాట్లను మాత్రం అదనపు ఖర్చుగా చూస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలను నివారించే చర్యల కంటే, ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం ప్రకటించడం పాలకులకూ, యాజమాన్యాలకూ అలవాటుగా మారింది. ఈ సంఘటన మరోసారి స్పష్టం చేసిన విషయం ఏమిటంటే, లాభాలనే కేంద్రంగా చేసుకున్న ఆర్థిక వ్యవస్థలో శ్రామికుడి ప్రాణం కంటే మూలధన విస్తరణకే అధిక ప్రాధాన్యం లభిస్తోంది.రెండవది, రక్షణ సిబ్బంది వెల్లడించిన వివరాలు అక్కడి పని పరిస్థితుల క్రూరత్వాన్ని బయటపెట్టాయి. ఎగువ క్వారీలో యంత్రాలతో బండరాళ్లు తరలిస్తుండగా, దిగువన పనిచేస్తున్న కార్మికులను ముందుగా హెచ్చరించే కనీస సమాచార వ్యవస్థ కూడా అక్కడ లేదు. ఒకే సర్వే నంబరులో ఐదేళ్లుగా పక్కపక్కనే నడుస్తున్న రెండు క్వారీల యజమానుల మధ్య కనీస సమన్వయం లేకపోవడం వల్లనే ఎగువ నుంచి దొర్లిన బండరాయి దిగువన పనిచేస్తున్నవారిపై పడింది. ఉత్పత్తి ఆగకూడదనే ఉద్దేశంతో, ఇలాంటి కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా పనులు కొనసాగించారు.ఇది ఒక్క యాజమాన్యం నిర్లక్ష్యానికి మాత్రమే పరిమితమైన విషయం కాదు. దేశవ్యాప్తంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల వాస్తవ జీవన పరిస్థితులకు ఇది ప్రతిబింబం. వీరిలో చాలామందికి నియామక పత్రాలు ఉండవు. ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత, సామాజిక రక్షణ, ఉద్యోగ హామీ వంటి హక్కులు అందుబాటులో ఉండవు. నివాసానికి తగిన వసతి లేక, దుమ్ము, శబ్ద కాలుష్యం మధ్య తాత్కాలిక షెడ్లలోనే జీవించాల్సి వస్తోంది. ఉత్పత్తి ప్రక్రియలో అత్యంత ప్రమాదకరమైన పనులను వీరితో చేయించుకుంటూనే, వారి జీవన ప్రమాణాలపై యాజమాన్యాలు ఎలాంటి బాధ్యత తీసుకోవడం లేదు.ఈ పరిస్థితుల్లో శ్రామికుడి ఆరోగ్యం, శారీరక సామర్థ్యం, పని చేసే కాలం అన్నీ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే లెక్కల్లో భాగంగా మారిపోతాయి. ఒక కార్మికుడు గాయపడినా, మరణించినా, అతని స్థానంలో మరో నిరుపేదను తీసుకురావచ్చనే అమానవీయ దృక్పథం దోపిడీని మరింత క్రూరంగా మారుస్తోంది. అందువల్ల ఆధునిక పరిశ్రమల్లో బానిసత్వం పాత రూపంలో కనిపించకపోయినా, ఆర్థిక బలహీనత, ఉద్యోగ అస్థిరత, ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోవడం ద్వారా శ్రామికుడిని ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయడానికి బలవంతం చేసే కొత్త రూపాన్ని సంతరించుకుంది.ఈ బానిసత్వానికి భారతదేశంలో ఒక చారిత్రక మూలం కూడా ఉంది. ఇక్కడ శూద్ర వర్ణంలో, భూస్వామ్యం చేతిలో ఉన్న కొద్దిమంది అగ్రకుల భూస్వాములను మినహాయిస్తే, మిగిలిన అతిశూద్ర కులాల శ్రమకు చరిత్రలో ఎన్నడూ సరైన విలువ దక్కలేదు. దీన్నే వెట్టి శ్రమ అని పిలిచేవారు. ఆనాటి వెట్టి విధానంలో ఎలాగైతే శూద్రుల శ్రమకు వెలకట్టకుండా వాడుకున్నారో, నేటి పారిశ్రామిక, క్వారీ యాజమాన్యాలు కూడా అదే చారిత్రక ధోరణిని కొత్త రూపంలో అమలు చేస్తున్నాయి. శూద్రుల శ్రమకు నిన్నటికీ నేటికీ విలువ లేకపోవడం యాదృచ్ఛికం కాదు, అది ఒక చారిత్రక కొనసాగింపు.మూడవది, ఏ పారిశ్రామిక ప్రమాదాన్నీ కేవలం యజమాని నిర్లక్ష్యంగా మాత్రమే చూడలేం. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వ శాఖలు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించినప్పుడే ఇలాంటి దుర్ఘటనలను ముందుగానే నివారించవచ్చు. కానీ బెంగళూరు క్వారీ విషయంలో అలా జరగలేదు. గనులు–భూగర్భ శాఖ, కార్మిక శాఖ, స్థానిక పరిపాలనా యంత్రాంగం, మైనింగు, పర్యావరణ పరిరక్షణ బోర్డు, అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వం తమ బాధ్యతలను నిర్వర్తించి ఉంటే ఈ ప్రమాదం ఇంత ఘోర రూపం దాల్చేది కాదు.స్థానిక ప్రజలు బఫర్ జోన్‌లోనే అనుమతుల్లేకుండా క్వారీయింగ్ కొనసాగుతోందని పలుమార్లు ఫిర్యాదులు చేశారు. యశ్వంత్‌పూర్ ఎమ్మెల్యే సోమశేఖర్ కూడా ఈ అక్రమాలను శాసనసభలో, పిటిషన్ల కమిటీ ముందు ప్రస్తావించారు, ఈ దురంతం కేవలం నిర్లక్ష్యం కాదని, భూగర్భ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు అక్రమ క్వారీ నిర్వహణకు కొమ్ముకాశారని ఆరోపించారు. అయినప్పటికీ తనిఖీలు, నియంత్రణ చర్యలు, లైసెన్సు నిబంధనల అమలులో ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదు. ప్రమాదం జరగకముందే అందిన హెచ్చరికలను నిర్లక్ష్యం చేయడం వల్లనే ఏడుగురు శ్రామికులు ప్రాణాలు కోల్పోయారు.ఈ సంఘటన ఒక ముఖ్యమైన వాస్తవాన్ని గుర్తు చేస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం చట్టాలను అమలు చేయడంలో విఫలమైతే, ఆ నిర్లక్ష్యం యజమానులకు పరోక్ష రక్షణగా మారుతుంది. తనిఖీలు సక్రమంగా జరగకపోవడం, ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోకపోవడం వల్ల భద్రతా ప్రమాణాలను విస్మరించే ధోరణి మరింత పెరుగుతోంది. చివరికి మూల్యం చెల్లించేది మాత్రం శ్రామికులే. అందుకే ఇలాంటి దుర్ఘటనలను వ్యక్తిగత తప్పిదాలుగా కాకుండా, పాలనా వైఫల్యంగా కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ప్రమాదం జరిగిన వెంటనే తవరేకెర పోలీసులు క్వారీ యజమానులు డి. ఆనందస్వామి, ఎస్.ఆర్. ఉదయశంకర్‌తో పాటు మరో ముగ్గురిపై నేర పూరిత నిర్లక్ష్యం కింద కేసు నమోదు చేశారు. అయితే ఏడాదిలో సంగతి కాదు, ఏడు రోజులు గడిచినా ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలోనే ఉండటం, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని కనిపించకుండా పోవడం, నిందితులను పట్టుకోవడంలో పోలీసు యంత్రాంగం ఎంత నిదానంగా వ్యవహరిస్తుందో చూపిస్తుంది. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబాలకు ప్రకటించిన పరిహారం, సహాయం పూర్తిగా అందించాలని ఎమ్మెల్యే సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యజమానులను కాపాడే ప్రయత్నం ఏమాత్రం జరగకూడదని ఆయన స్పష్టం చేశారు. డబ్బు, పలుకుబడి ఉన్నవారు ప్రాణనష్టం జరిగిన తర్వాత కూడా ఎంత సునాయాసంగా చట్టం నుంచి తప్పించుకోగలరో ఈ పరారీయే నిదర్శనం.యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలంలో కాలుష్యకారక పరిశ్రమలపై రైతులు ఏళ్ల తరబడి ఫిర్యాదులు చేస్తున్నా, ప్రధాన మంత్రి కార్యాలయం, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, హైకోర్టు, పార్లమెంటు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోకపోవడం ఇదే ధోరణికి మరో నిదర్శనం. ఇలాంటి ప్రాణాంతక పరిశ్రమలను నియంత్రించాల్సిన శాఖలు యజమానుల పక్షాన నిలబడటం వెనుక, పెట్టుబడిదారీ వర్గాల మెప్పు పొందడం, పెట్టుబడులను ఆకర్షించడం అనే అభివృద్ధి లక్ష్యమే కారణంగా కనిపిస్తుంది. యజమానుల పక్షాన ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయి, ప్రజల ప్రాణాలు తీసిన పరిశ్రమలను కట్టడి చేయడంలో మాత్రం ఏళ్ల తరబడి తాత్సారమే మిగులుతుంది.ఇక్కడ మరో ముఖ్యమైన వైరుధ్యాన్ని కూడా గమనించాలి. నేడు ప్రభుత్వం చాలా వ్యవహారాలను పేపర్‌లెస్, ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నామని చెబుతున్నా, కార్మికుల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు, చర్యల విషయంలో మాత్రం అధికార యంత్రాంగం ఆ విధానాన్ని అందిపుచ్చుకోవడం లేదు. ఏదైనా ఫిర్యాదుపై చర్య తీసుకోవాల్సిన ఆదేశం వచ్చినా, దాన్ని చేతిరాతతో లేదా పోస్టు ద్వారా చేరవేస్తున్నారు, దీనివల్ల తక్షణమే అమలులోకి రావాల్సిన ఆదేశం రోజుల తరబడి ఆలస్యంగా చేరుతుంది. ఈ ఆలస్యంలోనే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది, యాజమాన్యాలకు కోట్ల రూపాయల లాభం చేకూరుతుంది. అంటే, పరిపాలనా వేగం ఎక్కడ అవసరమో అక్కడ మందగించడం, ఎక్కడ మందగించాలో అక్కడ యజమానుల అనుకూలంగా వేగంగా కదలడం, ఇదే అసలు వైరుధ్యం.నాలుగవది, ఈ ప్రమాదంలో మరణించిన వారంతా బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, యాద్గిర్ నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన కార్మికులు. ఇది యాదృచ్ఛికం కాదు. ప్రాంతాల మధ్య అభివృద్ధిలో ఉన్న అసమానతలు, వ్యవసాయ సంక్షోభం, గ్రామీణ నిరుద్యోగం, భూమిలేని కుటుంబాల పెరుగుదల లక్షలాది మందిని స్వస్థలాలు విడిచి వలస వెళ్లే పరిస్థితికి నెడుతున్నాయి. వేల కిలోమీటర్లు ప్రయాణించి ఉపాధి సంపాదించినా, భద్రత మాత్రం వారికి అందని హక్కుగానే మిగులుతోంది.వలస కార్మికులు అధికంగా అసంఘటిత రంగంలోనే పనిచేస్తారు. శాశ్వత ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ, ప్రమాద బీమా, ఆరోగ్య సౌకర్యాలు, కార్మిక సంఘాల అండ వంటి హక్కులు వారికి చాలా సందర్భాల్లో అందుబాటులో ఉండవు. స్థానిక భాష తెలియకపోవడం, చట్టాలపై అవగాహన లేకపోవడం, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడం వంటి పరిస్థితులను యాజమాన్యాలు తమకు అనుకూలంగా మలుచుకుంటాయి. ఫలితంగా అత్యంత ప్రమాదకరమైన పనులను అత్యల్ప వేతనాలకు చేయించుకునే పరిస్థితి ఏర్పడుతోంది.ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల నుంచి నిరంతరం వలస వచ్చే ఈ శ్రమశక్తి యజమానులకు ఎప్పుడూ అందుబాటులో ఉండడం వల్ల, ఒక కార్మికుడి ప్రాణానికి విలువ తగ్గిపోతుంది. గాయపడిన లేదా మరణించిన వారి స్థానంలో మరొకరిని తీసుకొచ్చే అమానవీయ దృక్పథం బలపడుతోంది. ఇదే కారణంగా అనేక పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల కంటే ఉత్పత్తి నిరంతరతకే ప్రాధాన్యం ఇస్తున్నారు.మన దేశ సమాజంలో ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా చూడాల్సిన అవసరం ఉంది. అసంఘటిత రంగంలోని అత్యంత ప్రమాదకరమైన శారీరక శ్రమలో పనిచేసేవారిలో అధికశాతం మంది దళిత, బహుజన, ఆదివాసీ వర్గాలకు చెందినవారే. ఇది యాదృచ్ఛికం కాదు. చారిత్రకంగా ఆర్థిక ఆధిపత్యం, సామాజిక ఆధిపత్యం పరస్పరం బలపరుచుకుంటూ వచ్చాయి. అందువల్ల ప్రమాదకర శ్రమలో అధికంగా దళిత, బహుజన, ఆదివాసీలు ఉండగా, మూలధన యాజమాన్యంలో అగ్రవర్ణాల ప్రాబల్యం కొనసాగుతోంది. ఈ కారణంగా వర్గ దోపిడీ, కుల ఆధారిత శ్రమ విభజన ఒకదానికొకటి బలాన్నిస్తూ అసమానతలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.ఐదవది, ప్రతి పారిశ్రామిక ప్రమాదం తర్వాత ప్రభుత్వాలు దాదాపు ఒకే విధమైన చర్యలను పునరావృతం చేస్తుంటాయి. విచారణ కమిటీలు వేయడం, కొద్ది రోజులపాటు పరిశ్రమలను మూసివేయడం, కొందరు అధికారులను బదిలీ చేయడం, నోటీసులు జారీ చేయడం, మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించడం, ఇవన్నీ ప్రమాదం జరిగిన వెంటనే కనిపించే చర్యలు. కొద్ది రోజుల పాటు ఇవి వార్తల్లో నిలుస్తాయి. ప్రజల్లో చెలరేగిన ఆగ్రహం చల్లారిన తర్వాత మాత్రం పరిస్థితి మళ్లీ యథాతథంగా మారిపోతుంది.దీనికి కారణం ప్రమాదాన్ని ఒక వ్యక్తి తప్పిదంగా చూడడమే తప్ప, లాభాల కోసం భద్రతను త్యాగం చేసే ఉత్పత్తి విధానంలో అంతర్లీనంగా ఉన్న వైరుధ్యంగా చూడకపోవడమే. భద్రతా ప్రమాణాలను అమలు చేయడం కంటే, ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం చెల్లించడం చౌకగా ఉంటుందని భావించే దృక్పథం యాజమాన్యాల్లో బలపడుతోంది.బెంగళూరు క్వారీ దురంతం ఇది కర్ణాటకకు మాత్రమే పరిమితమైన సమస్య కాదని చూపిస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా దేశవ్యాప్తంగా ఇదే నిర్లక్ష్యం అనేక రూపాల్లో కనిపిస్తోంది. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని ఒక రొయ్యల ప్రాసెసింగ్, ఎగుమతి కేంద్రంలో జూన్ 2026లో అమ్మోనియా వాయువు లీకై, మొదట ఏడుగురు మరణించారని వార్తలు వచ్చినా, రోజులు గడిచేకొద్దీ మృతుల సంఖ్య పదిహేడుకు చేరింది, ఎనభై మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళా కార్మికులే, వీరంతా ఒడిశా, అస్సాం, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారు. అత్యవసర సమయాల్లో స్పందించే ముందస్తు రక్షణ ఏర్పాట్లు లేకపోవడం, లాభాల కోసమే తప్ప శ్రామికుల ప్రాణాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లనే ఈ ఘోరం జరిగింది. దీనికి తోడు, మధ్యవర్తులుగా వ్యవహరించే దళారీ కాంట్రాక్టర్లు కార్మికులను కేవలం ఒక చౌక శ్రమశక్తిగా చూస్తూ, వారి అధికారిక రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, వలస కూలీలకు తమ హక్కులపై కనీస అవగాహన కల్పించకపోవడం వల్ల ఈ వ్యవస్థాగత దోపిడీ నిరంతరాయంగా సాగుతోంది. ప్రభుత్వ కార్మిక శాఖల తనిఖీలలో ఉదాసీనత, అంతరాష్ట్ర సమన్వయ లోపం, కాంట్రాక్టర్ల అక్రమ రిక్రూట్‌మెంట్ విధానాల వల్లనే ఇటువంటి ప్రమాదాలు పునరావృతమవుతూ వలస జీవుల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నాయి.సంగారెడ్డి జిల్లాలోని సిగాచి రసాయన కర్మాగారంలో 2025 జూన్‌లో జరిగిన పేలుడులో యాభైకి పైగా కార్మికులు మరణించారు. మరణించిన ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించినా, ఏడాది గడిచినా సగటున కేవలం నలభై ఐదు లక్షలే చెల్లించారు, శాశ్వత వైకల్యం పొందిన వారికి పది లక్షలు, గాయపడిన వారికి ఐదు లక్షలు మాత్రమే నిర్ణయించారు. ఇది కేవలం జాప్యం కాదు, ప్రకటించిన మాటనే తుంగలో తొక్కి బాధిత కుటుంబాలను న్యాయస్థానాల చుట్టూ తిప్పే పాలనా నిర్లక్ష్యం.నల్లగొండ జిల్లాలో శ్రీశైలం అనుసంధాన కాలువ సొరంగం 2025 ఫిబ్రవరిలో కుప్పకూలి ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఏడాది గడిచినా వారిలో పలువురి మృతదేహాలు వెలికి తీయలేకపోవడం ప్రణాళికా లోపాలను, భద్రతా వైఫల్యాలను బహిర్గతం చేసింది. ఈ ప్రమాదానికి ఏ ఒక్క ప్రభుత్వాన్ని మాత్రమే కారణంగా చూపి తప్పించుకోలేం. ఏళ్ల తరబడి ఈ ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించకుండా, యంత్రాలను నిర్వహణ లేకుండా వదిలేసి పనులను స్తంభింపజేసిన నిర్లక్ష్యం ఒక వైపు ఉంటే, తర్వాత పనులు తిరిగి మొదలుపెట్టేటప్పుడు తగిన భూగర్భ అధ్యయనాలు, భద్రతా ముందు జాగ్రత్తలు తీసుకోకుండా హడావుడిగా ముందుకు పోవడం మరో వైపు కారణమైంది. అంటే అధికారంలో ఏ ప్రభుత్వం వచ్చినా, ప్రజల ప్రాణాల కంటే ప్రాజెక్టు రాజకీయ ప్రయోజనమే ముఖ్యమైందన్నది స్పష్టం. సొరంగంలో పనిచేస్తున్న కార్మికుల్లో అత్యధికులు బీహార్ వంటి తెలంగాణేతర రాష్ట్రాల నుంచి వచ్చినవారే, వీరికి కాంట్రాక్టు కంపెనీ రోజుకు కేవలం ఐదారు వందల రూపాయల కూలీ ఇస్తూ, అది కూడా నెలల తరబడి బకాయి పెట్టిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఒక కుటుంబం తన పెద్దదిక్కును కోల్పోయిన కడుపుకోతకు చివరికి ఎవరు జవాబుదారీ వహిస్తారు, లాభాలు జేబులో వేసుకున్న కాంట్రాక్టు సంస్థా, లేక ప్రాజెక్టును సరిగ్గా నిర్వహించని, కార్మికుల భద్రతను పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగమా అన్నది ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలింది.విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంపై జాతీయ మానవ హక్కుల సంఘం స్వయంగా జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరాల్సి రావడం కూడా పని ప్రదేశాల భద్రత ఎంత నిర్లక్ష్యానికి గురవుతోందో తెలియజేస్తోంది. ఇవి వేర్వేరు రాష్ట్రాల్లో జరిగిన విడివిడిగా ఉన్న సంఘటనలు కావు. భద్రత కంటే ఉత్పత్తికి, ఉత్పత్తి కంటే లాభాలకు ప్రాధాన్యం ఇచ్చే ఒకే విధమైన అభివృద్ధి నమూనా ఫలితాలు. అందుకే ప్రదేశాలు మారుతున్నాయి, ప్రమాదాల స్వరూపం మారుతోంది, కానీ బలవుతున్నవారు మాత్రం శ్రామికులే.మన దేశంలో కార్మిక ఉద్యమం వెల్లడిస్తున్న గణాంకాల ప్రకారం, పని ప్రదేశాల్లో జరిగే ప్రమాదాల్లో గణనీయమైన వాటా అధికారిక రికార్డుల్లోనే నమోదుకావడం లేదు. వేలాది కార్మికులు ప్రాణాలు కోల్పోయినా, అనేక సంఘటనలు గణాంకాల్లోకి కూడా రావడం లేదు. ప్రమాదాలను సక్రమంగా నమోదు చేయకపోవడం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, కార్మిక భద్రత కంటే ఉత్పత్తి నిరంతరతకే ప్రాధాన్యం ఇవ్వడం వంటి ధోరణులు ఈ విషాదాలను మరింత పెంచుతున్నాయి. ఇటీవలి చట్ట సవరణలపై కూడా కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి, యజమానుల బాధ్యతను తగ్గించే విధానాలు, కాంట్రాక్టు–ఔట్‌సోర్సింగ్ విధానాల విస్తరణ, శిక్షణ లేని కార్మికులను ప్రమాదకర విభాగాల్లో నియమించడం వంటి చర్యలు ప్రమాదాల అవకాశాలను మరింత పెంచుతున్నాయి. మరోవైపు, ప్రతి ప్రమాదం తర్వాత కార్మికుల నిర్లక్ష్యాన్నే కారణంగా చూపిస్తూ యాజమాన్యాలు బాధ్యత నుంచి తప్పించుకోవడం సాధారణమైపోయింది.అంతేకాదు, ప్రతి మరణానికి ప్రకటించే పరిహారం కూడా సమస్యకు పరిష్కారం కాదు. ఒక కుటుంబం తన ఆధారాన్ని కోల్పోయిన విషాదాన్ని డబ్బుతో భర్తీ చేయలేము. ప్రమాదం జరిగిన తర్వాత కొన్ని లక్షల రూపాయలు ప్రకటించడం కంటే, ప్రమాదం జరగకుండా నిరోధించే భద్రతా వ్యవస్థలను నిర్మించడం ప్రభుత్వాల, యాజమాన్యాల మొదటి బాధ్యత కావాలి. శ్రామికుడి ప్రాణానికి ధర కట్టే సంస్కృతి ఎంత త్వరగా ముగుస్తే, అంత త్వరగా ఇటువంటి దుర్ఘటనలు తగ్గుతాయి.అందువల్ల పరిష్కారం కేవలం పరిహారం, విచారణ కమిటీలు, నోటీసులతో ముగిసిపోకూడదు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి కార్మికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధించాలి. అందుకే ఈ విషాదాన్ని ఒక్క క్వారీ ప్రమాదంగా కాకుండా, శ్రమను చౌక వస్తువుగా చూసే అభివృద్ధి నమూనాపై తీవ్రమైన హెచ్చరికగా చూడాలి.నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలు, వారికి సహకరించే అధికార యంత్రాంగం, శ్రామికుల భద్రతను నిర్లక్ష్యం చేసే విధానాలు, ఇవన్నీ మారకపోతే బెంగళూరు దుర్ఘటన చివరిది కాదు. ప్రదేశాలు మారవచ్చు, పరిశ్రమలు మారవచ్చు, ప్రభుత్వాలు మారవచ్చు, కానీ బలయ్యేది మాత్రం అదే శ్రామిక వర్గం. అందుకే కార్మిక లోకం, ప్రజాస్వామ్య శక్తులు, సామాజిక ఉద్యమాలు రాష్ట్రాల సరిహద్దులను దాటి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. శ్రామికుడి ప్రాణం లాభాల కంటే గొప్పదనే విలువ సమాజంలో స్థిరపడినప్పుడే ఇలాంటి వ్యవస్థాగత విషాదాలకు శాశ్వత ముగింపు లభిస్తుంది.



పాపని నాగరాజు
(సత్యశోధక మహాసభ)

# మరకత శివాలయంలో భక్తజన సందోహం






**మాస శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ సతీమణి మంజులాదేవి**

**శంకర్పల్లి, వెలుతురు జూలై 13:**

మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన చారిత్రాత్మక, 11వ శతాబ్దపు మహిమగల బ్రహ్మసూత్ర మరకత శివాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. సోమవారం నాటి మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అరుదైన ఆధ్యాత్మిక యోగం ఈ ఏడాది మాస శివరాత్రితో పాటు సోమవారం, ఆరుద్ర నక్షత్రం మరియు మహాశైవాక్ష యోగం ఒకే రోజు కలిసి రావడం అత్యంత విశిష్టమైనదని అర్చకులు తెలిపారు. ఈ అరుదైన ఆధ్యాత్మిక సంయోగం నేపథ్యంలో, స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయనే నమ్మకంతో వేకువజామున 4 గంటల నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. శివనామస్మరణతో చందిప్ప గ్రామం మారుమోగింది. స్వామివారి సేవలో ఎంపీ సతీమణి ఈ వేడుకల్లో భాగంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు సతీమణి మంజులాదేవి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారికి ఆమె ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు వేద ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.భక్తులకు ఘనంగా ఏర్పాట్లుభక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ చైర్మన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లు, తాగునీరు, ఎండ తీవ్రత తగలకుండా షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనాలు సాగేలా చైర్మన్ స్వయంగా పర్యవేక్షించారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు.

# ల్యాండ్ పూలింగ్ చెల్లింపులో ఎకరానికి 1200 గజాలు ఇవ్వాలని కోరిన రైతులు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 13:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలం పరిధి సర్వేనెంబర్ 453, 454 భూములపై సోమవారం దుండిగల్ మున్సిపల్ వార్డు కార్యాలయంలో రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అతిథిగా మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రసాద్, మండల తాసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి రైతులతో భూములపై రైతుల అభిప్రాయ సేకరణ చేశారు. గతంలో గ్రామ వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం భూములను 300 రైతులకు పైగా పట్టాలివ్వడం జరిగింది. చాలామంది రైతులు వ్యవసాయ సాగు చేసేందుకు నీరు లేకపోవడంతో సాగు చేయడంలేదు. గత రెండు సంవత్సరాలకు పైగా ఈ భూములను ప్రభుత్వమే తిరిగి తీసుకోనుంది. ప్రభుత్వ నిర్ణయం గతంలో కలెక్టర్ రైతులను ఒప్పించి తీసుకోవాలన్న అభిప్రాయంతో గత ప్రభుత్వంతో పాటు ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత నెల ప్రభుత్వ అధికారులతో గ్రామ సభ నిర్వహించి రైతుల అభిప్రాయాలను తీసుకున్న విషయం అందరికీ తెలిసిందే. గత గ్రామ సభలో రైతులకు ఎకరాకు 500గజాల స్థలం ఇస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనకు రైతులు ఏకీభవించలేరు. దీంతో తదుపరి గ్రామసభ నిర్వహిస్తామని అధికారులు తెలపడంతో తిరిగి మరల గ్రామసభ నిర్వహించిన నేపథ్యంలో ఈసమావేశంలో రైతులు తమ అభిప్రాయం ఆర్డీఓ, మండల తాసిల్దార్ కు తెలియజేస్తూ భూ నిర్వాసితులకు ఎకరాకు తప్పనిసరిగా 1200గజాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దుండిగల్ గ్రామ పరిధిలో ఎటువంటి మౌలిక వసతులు లేవని ఫంక్షన్ హాల్, వైకుంఠధామం, ఆటస్థలాలు వంటి సౌకర్యాలు ఇక్కడ వసతులు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు చిన్నంగి వెంకటేశం, టిపిసిసి ఎగ్జిక్యూటివ్ క్యాంపెనింగ్ సభ్యులు లబ్దిపీర్ల నర్సింగ్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంరెడ్డి, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కావలి శశికుమార్, ఆకుల విజయసాయి, భానుగౌడ్, రాజుకుమార్ ముదిరాజ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అక్షయపాత్ర సహకారంతో ప్రభుత్వ బడుల్లో ఉదయం అల్పాహారం..





● **విద్యార్థుల్లో హర్షాతిరేకాలు**

**శంకర్పల్లి, వెలుతురు జూలై 13:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉదయం అల్పాహారం కార్యక్రమం శంకర్పల్లి మండలంలో ఘనంగా ప్రారంభమైంది. ప్రసిద్ధ స్వచ్ఛంద సంస్థ 'అక్షయ పాత్ర' సహకారంతో సోమవారం నుండి మండలంలోని అన్ని ప్రభుత్వ బడులలో ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచులు రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉదయాన్నే ఖాళీ కడుపుతో పాఠశాలలకు రాకుండా, వారికి పౌష్టికాహారాన్ని అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని కొనియాడారు. అక్షయ పాత్ర సంస్థ వారి భాగస్వామ్యంతో నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం విద్యార్థులకు లభిస్తుందని, ఇది వారి ఆరోగ్యానికి, చదువుపై ఏకాగ్రత పెంచడానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పథకం ప్రారంభం కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# శివ కరుణ శారీస్ ఘన ప్రారంభోత్సవం




**ఎల్బీనగర్, వెలుతురు జులై 13:**



ఆదిత్య నగర్ (ఆపోజిట్) జిహెచ్ఎంసి పార్క్ లెక్చరర్స్ కాలనీ హయత్ నగర్లో లో శివ కరుణ శారీస్ వస్త్రాలయం ఘన ప్రారంభోత్సవం నిర్వాహకులు కరుణ భీమిడి మాట్లాడుతూ ఈ పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే నూతన పద్ధతులలో శారీస్ అందుబాటులో అందిస్తున్న వస్త్రాలయం అని తెలియజేశారు ప్రారంభోత్సవం సందర్భంగా కేవలం 1000 రూపాయలకు 3 శారీస్ అందిస్తున్నాము. 5 వేల కొనుగోలుపై 1500 శారీస్ ఉచితంగా అందిస్తున్నాము. పదివేల రూపాయల కొనుగోలుపై 3500 కంచి పట్టు శారీస్ ఉచితంగా అందజేస్తున్నాము ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగపరచుకోగలరని విజ్ఞప్తి చేస్తున్నాను ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు శ్రేయోభిలాషులు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో 'దీక్షారంభ్–2026' విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా ప్రారంభం

**శంకర్ పల్లి, వెలుతురు జూలై 13:**

ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, హైదరాబాద్‌లో నూతన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న పది రోజుల "దీక్షారంభ్–2026" విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం సోమవారం ఐఎఫ్‌హెచ్ఈ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైంది. జూలై 13 నుండి 24 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమం ద్వారా నూతన విద్యార్థులు విశ్వవిద్యాలయ వాతావరణానికి అలవాటు పడటంతో పాటు విద్యా ప్రతిభ, వృత్తి నైతిక విలువలు మరియు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతుంది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కొచ్చిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్డ్ లీగల్ స్టడీస్ వైస్–చాన్సలర్ ప్రొఫెసర్ (డా.) జి. బి. రెడ్డి ముఖ్య అతిథిగా, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ పి. సీతారాం గౌరవ అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ (డా.) జి. బి. రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం క్రమశిక్షణ, కృషి, నిజాయితీ మరియు నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవాలని సూచించారు. న్యాయ విద్యలో లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విమర్శనాత్మక ఆలోచన, సమర్థవంతమైన



కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు సామాజిక బాధ్యతను పెంపొందించుకొని ఉత్తమ న్యాయవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.గౌరవ అతిథి శ్రీ పి. సీతారాం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు మరియు ఇతర వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. నేటి యువతే దేశ భవిష్యత్తని పేర్కొంటూ, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, ఆరోగ్యకరమైన అలవాట్లు, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించడం ఎంతో అవసరమన్నారు. చట్టాన్ని గౌరవిస్తూ సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఐఎఫ్‌హెచ్ఈ ఇన్‌చార్జి వైస్–చాన్సలర్ ప్రొఫెసర్ (డా.) టి. కోటి రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యా రంగంలో ప్రతిభ కనబరచడంతో పాటు నైతిక విలువలను పాటిస్తూ సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అంతకుముందు ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డా.) పి. రవిశేఖర రాజు ప్రారంభోపన్యాసం చేస్తూ, "దీక్షారంభ్" కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సంస్థ విద్యా సంస్కృతి, విలువలు మరియు అందుబాటులో ఉన్న అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొని విజయవంతమైన న్యాయవృత్తికి పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమం ప్రారంభంలో డా. ఎ. అరుణ్ కుమార్, అసిస్టెంట్ డీన్ (స్టూడెంట్ యాక్టివిటీస్), స్వాగత ప్రసంగం చేస్తూ ఓరియంటేషన్ కార్యక్రమం లక్ష్యాలను వివరించి, నూతన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక స్వాగతం పలికారు.చివరగా డా. గౌరీ బి. చనాల్, అకాడెమిక్ కోఆర్డినేటర్, ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్య అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.జూలై 24 వరకు కొనసాగే ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో నిపుణుల ఉపన్యాసాలు, పరస్పర చర్చలు, అకాడెమిక్ అవగాహన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు మరియు విద్యార్థుల సమగ్ర వికాసానికి తోడ్పడే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్నగర్ జిల్లాల ఉద్యమకారుల పరిష్కరించాలి:ఎం. అశోక్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 13:**

ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్నగర్ జిల్లాల ఉద్యమకారుల పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమ నాయకులు యం.అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్నగర్ జిల్లాల ఉద్యమకారుల సమావేశం కేకే కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈకార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు యం.అశోక్ రెడ్డి, సంపత్ మాధవరెడ్డి, సూదగాని వెంకటేష్ గౌడ్, మల్లేష్, మారం లక్ష్మారెడ్డి తదితర నాయకులు పాల్గొని ఉద్యమకారులను ఎట్ల గుర్తించాలో సూచనలు సలహాలు ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఉద్యమకారుల లిస్టు, ఉద్యమకారుల చరిత్ర బుక్ ను ఇవ్వడం జరిగింది. ఈసమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకులు అశోక్ రెడ్డి మాట్లాడుతూ... ఈ క్రింది సూచనలు తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించడం అనేది కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదు, వారి త్యాగాలకు ఇచ్చే గౌరవం అన్నారు. ప్రభుత్వం ఈ క్రింది అంశాల ఆధారంగా ఉద్యమకారులను గుర్తిస్తే పారదర్శకత, నిష్పాక్షికత ఉండే అవకాశం ఉంటుంది. 1. అధికారిక రికార్డుల పరిశీలన...

కేసుల వివరాలు: ఉద్యమ సమయంలో (ముఖ్యంగా 2001 నుండి 2014 మధ్య) నమోదైన పోలీసు కేసులు, ఎఫ్.ఐ.ఆర్ (FIR) కాపీలను ప్రాథమిక ఆధారంగా తీసుకోవచ్చు.



జైలు శిక్ష: ఆందోళనల్లో పాల్గొని జైలుకు వెళ్లిన వారు, రిమాండ్‌లో ఉన్నవారి రిజిస్టర్లను పరిశీలించడం.

2.క్షేత్రస్థాయి కమిటీల ఏర్పాటు....

జిల్లా/మండల కమిటీలు: కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, స్థానిక స్థాయిలో అప్పటి ఉద్యమ సంఘాల నాయకులు, మేధావులతో కూడిన కమిటీలను వేసి నిజమైన ఉద్యమకారులను ధృవీకరించడం.

సాక్ష్యాల సేకరణ: పత్రికా ప్రకటనలు, ఫోటోలు, వీడియో ఫుటేజీలు లేదా అప్పటి ఉద్యమ జెఎసి (JAC) ధృవీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలి.

3 వర్గీకరణ ద్వారా ప్రాధాన్యత...

ఉద్యమకారులను వారి పాత్రను బట్టి వర్గీకరించడం వల్ల సహాయం అందించడం సులభమవుతుంది.

అమరవీరుల కుటుంబాలు: వీరికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

గాయపడిన వారు: లాఠీచార్జీలు లేదా ఇతర ఘటనల్లో శారీరకంగా దెబ్బతిన్న వారు.

విద్యార్థి ఉద్యమకారులు చదువు వదిలి ఉద్యమంలోకి



దూకిన వారి ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడం

4. పారదర్శకమైన డిజిటల్ పోర్టల్

ఆన్‌లైన్ దరఖాస్తు: అర్హులైన వారు తమ దగ్గర ఉన్న ఆధారాలతో దరఖాస్తు చేసుకునేలా ఒక పోర్టల్ ఉండాలి.

ప్రజా ఫిర్యాదులు: అనర్హులు జాబితాలోకి రాకుండా ఉండేందుకు, ఎంపికైన వారి పేర్లను గ్రామ సభల్లో లేదా వెబ్‌సైట్‌లో ఉంచి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించడం.

గుర్తింపు పొందిన వారికి అందించాల్సిన గౌరవం:

గుర్తింపు కార్డులు: రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందేలా ప్రత్యేక ఉద్యమకారిణి/ఉద్యమకారుడు' ఐడి కార్డులు.

సంక్షేమ పథకాలు: పెన్షన్, ఉచిత వైద్య సౌకర్యం, బస్సు పాస్‌లు లేదా పిల్లల విద్యలో రాయితీలు కల్పించడం.

నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరిగినప్పుడే తెలంగాణ ఆకాంక్షలకు పూర్తి గౌరవం దక్కుతుందని చెప్పారు.

# పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు వెంటనే అమలు చేయాలి:సిఐటియు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 13:**

మేడ్చల్– మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ.... మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులకు చట్టబద్ధంగా కల్పించాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవులు, భద్రతా పరికరాలు తదితర అన్ని సౌకర్యాలను ప్రతి యాజమాన్యం తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేకుండా పనిచేస్తున్న





కార్మికులను వెంటనే ఆయా పథకాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్మికులు కనీస వేతనాలు, చట్టబద్ధమైన హక్కుల కోసం ప్రశ్నించినప్పుడు యాజమాన్యాలు కార్మిక సంఘాల నాయకులను, కార్మికులను బెదిరించడం, వేధించడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం వంటి చర్యలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలన్నారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన సంఘటిత హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 6ను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో ఎలాంటి మినహాయింపులు లేకుండా కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ వెంకటరామయ్య, సిఐటియు మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకట్రాజ్యం, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, సిఐటియు నాయకులు నాగభూషణ్, స్వామి, భాస్కర్ లు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్త ఉచిత బస్ పాసులు ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 13:**

వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ రాష్ట్ర వ్యాప్త ఉచిత బస్ పాసులు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కూకట్ పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయ ఓఎస్ కు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్న జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసులు ఇస్తే నష్టం లేదని తెలిపారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా మాయొక్క జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీపై ప్రయాణ సదుపాయం అమలు చేయడం మంచిదే కానీ గత కొంతకాలంగా 1/3 చార్జీలు అంటూనే దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఎలాంటి వేతన సౌకర్యం




లేని జర్నలిస్టులకు మోయలేని భారమవుతుందని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులకు ఈచార్జీలు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తినే నమ్ముకొని సమాజ అభివృద్ధి కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులు స్థానికంగా ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ కొద్దిమందిగా ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరంగా ఉందన్నారు. జర్నలిస్టులకు అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు నాగార్జున, షబ్బీర్, చందు, నాగరాజు, రాజులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 13:**

కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో తెలంగాణ చౌక్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలు కార్మిక సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మానేరు నదిలో లభిస్తున్న ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల స్థానికంగా ఇసుక కొరత ఏర్పడి భవన నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయని, దాంతో వేలాది మంది నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. స్థానిక అవసరాల కోసం స్థానిక ఇసుక వినియోగానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.అలాగే ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న






లేబర్ కార్యాలయాన్ని కలెక్టరేట్ ప్రాంగణానికి మార్చాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు సరిగా జరగడం లేదని, వెంటనే కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చొరవతో త్వరలో కరీంనగర్‌లో కార్మికుల కోసం ఈఎస్ఐ (ESI) ఆసుపత్రి ఏర్పాటు కానుందని మేయర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే కార్మికుల పక్షాన నిలబడి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మేయర్ హెచ్చరించారు.అనంతరం కార్మిక సంఘాల నాయకులతో కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భక్తి భావంతో గురువులను పూజించాలి

- **మోటివేషనల్ స్పీకర్ గూడూరు అంజిరెడ్డి**

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 15:**



విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను భక్తి భావంతో గౌరవిస్తూ మెలగాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్ సెక్రటరీ, లయన్స్ క్లబ్ హైదరాబాద్ రిజింగ్ స్టార్స్ సెక్రటరీ, మోటివేషనల్ స్పీకర్ గూడూరు అంజిరెడ్డి సూచించారు.సోమవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విజన్ బిల్డర్స్ మరియు లయన్స్ క్లబ్ హైదరాబాద్ రిజింగ్ స్టార్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా గూడూరు అంజిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల కోసం తమ జీవితాన్ని అంకితం చేసే తల్లిదండ్రులతో గౌరవ మర్యాదలతో మెలగాలని, వారి ఆశయాలను నెరవేర్చేలా కృషి చేయాలని సూచించారు. అలాగే విద్యార్థుల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే ఉపాధ్యాయులను గౌరవిస్తూ, శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.అనంతరం ఇంపాక్ట్ ఫౌండేషన్ రీజియన్ ప్రెసిడెంట్ కోట సరిత మాట్లాడుతూ, విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన దిశగా కృషి చేసి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని తెలిపారు.కార్యక్రమం అనంతరం లయన్స్ క్లబ్ మరియు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ రీజియన్ జాయింట్ సెక్రటరీ నారాయణ కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రభ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి , స్వప్న, శశిమ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిడ్డ ఈశ్వరమ్మ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జక్కిడి శివచరణ్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి

**వీరమళ్ళ కార్తీక్ గౌడ్**

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు జూలై 13:**

సోమవారం రోజున సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వీరమళ్ళ కార్తీక్ గౌడ్ మాట్లాడుతూ, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియమితులైన బీసీ బిడ్డ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ గారిపై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.బీసీ మహిళను అవమానించేలా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని, వెంటనే ఈశ్వరమ్మ యాదవ్ గారికి, యాదవ జాతికి, బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, అవసరమైతే జక్కిడి శివచరణ్ రెడ్డి నివాసాన్ని ముట్టడించి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి వ్యాఖ్యలనైనా సహించబోమని, బీసీ సమాజం ఐక్యంగా తగిన సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం మండల అధ్యక్షులు కొప్పు రామకృష్ణ, నియోజవర్గ నాయకులు కట్కూరి శ్రీకాంత్, బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొల్లూరు నవీన్, కిషోర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలి

- **చిరుమర్తి చేయూత ఫౌండేషన్ చైర్మన్ చిరుమర్తి మనోజ్**

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 15:**



ఎస్ఐఆర్ (Special Intensive Revision) సర్వేలో భాగంగా సంబంధిత బీఎల్ఓల (BLO) నుంచి ఎన్యూమరేషన్ పత్రాలను ఈరోజు స్వీకరించినట్లు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు.ఈ సందర్భంగా చిరుమర్తి చేయూత ఫౌండేషన్ చైర్మన్ చిరుమర్తి మనోజ్ మాట్లాడుతూ, ఓటరు జాబితాను పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా పాల్గొనాలని కోరారు.ప్రతి అర్హత కలిగిన ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ పత్రాన్ని పూర్తిగా, సరైన వివరాలతో నింపి, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్ఓ లేదా ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు.ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా నమోదవడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఎస్ఐఆర్ సర్వేను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సర్కారు సంపన్నులకు దోచిపెట్టి గీత కార్మికులకు మొండి చేయి చూపుతుంది

- **రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ**

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

సోమవారం రోజున కల్లుగీత కార్మిక సంఘం కార్యకర్తల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని కాట్రగడ్డ హాల్లో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ అధ్యక్షత వహించారు.దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదాని అంబానీ లాంటి సంపన్నులకు అప్పనంగా సంపద దోచిపెడుతుందని అన్నారు. వృత్తిదారులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని , వారి బాగోగులు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గీత కార్మికులకు అనేక వాగ్దానాలు చేసిందని ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. వృత్తిలో ప్రమాదం జరిగిన వారికి ఇవ్వాల్సిన 20 కోట్లు రూపాయలు 30 నెలల కాలం అయినా ఎందుకు ఇవ్వడంలేదని అన్నారు. పెన్షన్ 4 వేలకు ఎక్స్ గ్రేషియా పది లక్షలకు పెంచుతామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయి అన్నారు. వృత్తిలో ఆధునీకరణకు చర్యలు తీసుకొని గీత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కల్లుగీత కార్మిక






సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కల్లుగీత వృత్తి నేపథ్యం, సంఘం విశిష్టత అనే అంశంపై క్లాస్ బోధించారు. క్లాస్ కు ప్రిన్సిపల్ గా వి. వెంకట నరసయ్య వ్యవహరించగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు,గౌని వెంకన్న,బాల్నే వెంకట మల్లయ్య, గౌని సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శులు చౌగని సీత రాములు, ఎస్.రమేష్ గౌడ్,బుర్ర శ్రీనివాస్,మడ్డి అంజి బాబు, రాగిరు కృష్ణయ్య,గుండెబోయిన రవి గౌడ్, మెరుగు వీరస్వామి,గౌరవ సలహాదారులు పి. అచ్చులు తదితరులు పాల్గొన్నారు.

# నార్కట్‌పల్లి నూతన తహశీల్దార్ తీగలపల్లి వేణుగోపాల్ రావుకు ఘన సన్మానం

**నార్కట్ పల్లి వెలుతురు జులై13:**



నార్కట్‌పల్లి మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తీగలపల్లి వేణుగోపాల్ రావును ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో పురం సంతోష్ కుమార్ (ప్రెస్ క్లబ్ అధ్యక్షులు) పీవీసీ న్యూస్ ఛానల్,లింగాల ముత్తయ్య (ప్రధాన కార్యదర్శి) వెలుతురు దినపత్రిక రిపోర్టర్,జనిగె కృష్ణ యాదవ్ (ఉపాధ్యక్షులు ప్రశ్నించే హక్కు తెలుగు దినపత్రిక నకిరేకల్ నియోజకవర్గం రిపోర్టర్, పులిగిల్ల సునీల్ కుమార్ ( మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కార్యదర్శి) మరియు తదితరులు పాల్గొని నూతన తహశీల్దార్‌ను ఘనంగా సన్మానించారు.

# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత తప్పనిసరి..

- **సుప్రీంకోర్టు కీలక తీర్పు**
- **పౌరసత్వం రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కుల్లో ఒకటని వ్యాఖ్య**
- **అక్రమంగా పౌరసత్వం పొందకుండా నిరోధించే అధికారం కేంద్ర ప్రభుత్వానిదేనని వెల్లడి**
- **చిన్నపాటి స్పెల్లింగ్, టైపింగ్ తప్పిదాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవద్దని సూచన**
- **గువాహటి హైకోర్టు, విదేశీయుల ట్రైబ్యునళ్ల తీర్పులను పక్కన పెట్టిన ధర్మాసనం**
- **కేసులను మళ్లీ విచారించాలని ట్రైబ్యునళ్లకు ఆదేశాలు**
- **పునర్విచారణ పూర్తయ్యే వరకు 27 మందిపై ఎలాంటి బలవంతపు చర్యలు వద్దని స్పష్టం**
- **న్యాయపరమైన ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచన**

**ఢిల్లీ వెలుతురు జూలై 13:**

పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియలో పూర్తి పారదర్శకత, న్యాయబద్ధత, సహజ న్యాయసూత్రాలు తప్పనిసరిగా పాటించాలని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించడం అనేది అతని జీవితాన్ని పూర్తిగా ప్రభావితం చేసే అత్యంత తీవ్రమైన నిర్ణయమని పేర్కొన్న ధర్మాసనం, అలాంటి నిర్ణయాలు తీసుకునే సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. అస్సాంకు చెందిన 27 మంది పిటిషనర్లకు తాత్కాలిక రక్షణ కల్పిస్తూ ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసును విచారించిన ధర్మాసనం పౌరసత్వం, విదేశీయుడనే హోదా సాధారణ పరిపాలనా అంశాలు కావని, అవి రాజ్యాంగపరంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలని వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తి భారత పౌరుడా, కాదా అనే నిర్ణయం అతని ప్రాథమిక హక్కులు, జీవనోపాధి, ఓటు హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కు, దేశంలో నివసించే హక్కు వంటి అనేక అంశాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని గుర్తు చేసింది. అందువల్ల అలాంటి నిర్ణయాలు చట్టబద్ధమైన ఆధారాలపైనే తీసుకోవాలని స్పష్టం చేసింది.అదే సమయంలో భారతదేశంలో అక్రమంగా పౌరసత్వం పొందే ప్రయత్నాలను అడ్డుకోవడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతేనని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశ భద్రత, సరిహద్దుల రక్షణ, చట్టవిరుద్ధ వలసలను నియంత్రించడం వంటి అంశాల్లో కేంద్రానికి రాజ్యాంగబద్ధమైన అధికారాలు ఉన్నాయని తెలిపింది. అయితే ఆ అధికారాలను వినియోగించే సమయంలో న్యాయపరమైన విధానాలను విస్మరించరాదని, ప్రతి వ్యక్తికి తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించాల్సిందేనని స్పష్టం చేసింది.ఈ కేసు అస్సాంలో విదేశీయుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించినది. పిటిషన్ దాఖలు చేసిన 27 మంది తమ కుటుంబ సభ్యులు ఎన్నో ఏళ్లుగా భారతదేశంలో నివసిస్తున్నారని, తమ పేర్లు పాత ఓటర్ల జాబితాల్లో నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. అయితే పాత ఓటర్ల జాబితాల్లో వారి పేర్ల స్పెల్లింగ్‌లో ఉన్న చిన్నచిన్న వ్యత్యాసాలు, టైపింగ్ తప్పిదాలు, భాషా మార్పుల కారణంగా వచ్చిన అక్షర దోషాలను ఆధారంగా తీసుకుని సంబంధిత విదేశీయుల ట్రైబ్యునళ్లు తమను విదేశీయులుగా ప్రకటించాయని వారు సుప్రీంకోర్టుకు వివరించారు.పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదిస్తూ.. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల పేర్లు వేర్వేరు కాలాల్లో వేర్వేరు విధాలుగా నమోదు కావడం అసాధారణం కాదన్నారు. ముఖ్యంగా ఇంగ్లిష్, అస్సామీ, బెంగాలీ వంటి భాషల మధ్య పేర్ల అనువాదంలో, స్పెల్లింగ్‌లో మార్పులు సహజమని తెలిపారు. ఇలాంటి చిన్నపాటి పొరపాట్లను ఆధారంగా తీసుకుని వ్యక్తులను విదేశీయులుగా ప్రకటించడం న్యాయసమ్మతం కాదని వాదించారు.ఈ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు కూడా పత్రాల్లో ఉన్న చిన్నచిన్న స్పెల్లింగ్ లేదా టైపింగ్ లోపాలను మాత్రమే ఆధారంగా తీసుకుని ఒక వ్యక్తి పౌరసత్వంపై తుది నిర్ణయానికి రావడం సరైన విధానం కాదని అభిప్రాయపడింది. ప్రతి కేసును అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలు, కుటుంబ సంబంధాలు, పాత ప్రభుత్వ రికార్డులు, స్థానిక పరిస్థితులు, ఇతర ధ్రువపత్రాల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాలని సూచించింది.ఈ సందర్భంగా గువాహటి హైకోర్టు, విదేశీయుల ట్రైబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అయితే పిటిషనర్లు సమర్పించిన పౌరసత్వ ఆధారాలను తాము ఈ దశలో పూర్తిగా పరిశీలించడం లేదని కూడా స్పష్టం చేసింది. పౌరసత్వంపై తుది నిర్ణయం తీసుకోవడం ట్రైబ్యునళ్ల బాధ్యతేనని పేర్కొంటూ, కేసులను మళ్లీ విచారించాలని ఆదేశించింది.పునర్విచారణ సందర్భంగా పిటిషనర్లు సమర్పించే అన్ని పత్రాలు, కుటుంబ వంశవృక్షం, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులు, ఇతర ప్రభుత్వ ధ్రువపత్రాలను సమగ్రంగా పరిశీలించాలని ట్రైబ్యునళ్లకు సూచించింది. ప్రతి వ్యక్తికి తన వాదనను పూర్తి స్థాయిలో వినిపించుకునే అవకాశం ఇవ్వాలని, సహజ న్యాయసూత్రాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించింది.మరోవైపు, పునర్విచారణ పూర్తయ్యే వరకు ఆ 27 మంది పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వారిని నిర్బంధించడం, దేశం విడిచి వెళ్లాలని ఒత్తిడి చేయడం లేదా ఇతర పరిపాలనా చర్యలు చేపట్టరాదని తెలిపింది.

దీంతో వారికి తాత్కాలిక రక్షణ లభించింది.అస్సాంలో అక్రమ వలసదారుల గుర్తింపు అంశం దశాబ్దాలుగా అత్యంత సున్నితమైన అంశంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విదేశీయుల ట్రైబ్యునళ్ల తీర్పులు, జాతీయ పౌరుల నమోదుపత్రం (ఎన్ఆర్సీ) ప్రక్రియ, పౌరసత్వ వివాదాలకు సంబంధించిన కేసులు తరచుగా న్యాయస్థానాల ముందుకు వస్తున్నాయి. ఈ తాజా తీర్పు కూడా అలాంటి కేసుల్లో న్యాయపరమైన ప్రక్రియ ఎంత ముఖ్యమో మరోసారి స్పష్టం చేసింది.మొత్తంగా చూస్తే, ఒకవైపు దేశ భద్రతను కాపాడుతూ అక్రమ వలసలను అరికట్టడం ప్రభుత్వ బాధ్యత అని, మరోవైపు నిజమైన భారత పౌరులు అన్యాయానికి గురికాకుండా చట్టబద్ధమైన, పారదర్శకమైన, నిష్పాక్షికమైన విచారణ జరగాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉందని సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా స్పష్టం చేసింది. వ్యక్తిగత హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, దేశ ప్రయోజనాలు.. ఈ మూడింటి మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరాన్ని ధర్మాసనం తన వ్యాఖ్యల ద్వారా మరోసారి నొక్కి చెప్పింది.

# విద్యార్థుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది



- కరీంనగర్‌లో ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ వెలుతురు జూలై 13:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గారితో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిష్యత్తు బలంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారే పేగు సంబంధిత నులిపురుగుల నివారణే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, కౌమారదశలో ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల నులిపురుగుల సమస్యను నివారించడంతో పాటు రక్తహీనత తగ్గుతుందని, నీరసం, ఆకలి మందగించడం వంటి సమస్యలు దూరమవుతాయని చెప్పారు. దీనివల్ల పిల్లలు శారీరకంగా దృఢంగా, మానసికంగా చురుకుగా ఉండి చదువుపై పూర్తి ఏకాగ్రతతో మెరుగైన ప్రతిభ కనబరుస్తారని వివరించారు."నేటి బాలలే రేపటి పౌరులు. వారు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించి, సమాజ అభివృద్ధికి తోడ్పడగలరు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే బలమైన దేశ నిర్మాణానికి పునాది" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్య, విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు గారు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీరామ్ గారు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ గారు, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), ఇతర జిల్లా స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోహీర్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణ



**విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ...**

**ఆరోగ్య పరిరక్షణపై అవగాహన....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 13:**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని టీఎంఆర్ఈఐఎస్ కోహీర్, జడ్పీహెచ్ఎస్ దిగ్వాల్ పాఠశాలల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీఎంఆర్ఈఐఎస్ కోహీర్‌లో మున్సిపల్ చైర్మన్ అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మహ్మద్ జాకీర్ హుస్సేన్, వైద్యాధికారి డాక్టర్ దివ్యజ్యోతి, టీఎంఆర్ఈఐఎస్ ప్రిన్సిపాల్ అలియా ఫిర్దౌస్, ఆరోగ్య పర్యవేక్షకులు నర్సిములు, నిరంజన్, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం అవసరమని సూచించారు.అలాగే జడ్పీహెచ్ఎస్ దిగ్వాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మహ్మద్ అహ్మద్ అలీ, మండల విద్యాధికారి మహ్మద్ జాకీర్ హుస్సేన్, వైద్యాధికారి డాక్టర్ నవీన్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు వెంకటేష్ గౌడ్, రాంచందర్ భీమ్‌వంశీ, అశ్విని, బీజీ విజయలక్ష్మి , ఇఫ్తేఖార్, మాధవి తదితరులు పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

# చేనేత సహకార సంఘాల చైర్మన్ లకు డైరెక్టర్లకు సన్మానం

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 13 :**



సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగళ పేట్ మండల పరిధిలోని గ్రామమైన హనుమంతరావు పేటలో ఇటీవల ఏకగ్రీవంగా గెలిచిన చేనేత సహకార సంఘాల చైర్మన్ లకు డైరెక్టర్లకు సోమవారం శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శాలువా మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. మంగల్ పేట సొసైటీకి చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన కూచిని ప్రకాష్, హనుమంతరావుపేట్ సొసైటీకి చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్యాల సాయిలు, డైరెక్టర్లకు నారాయణఖేడ్ పద్మశాలి సంఘం అధ్యక్షులు గున్నాల నర్సింలు,కోశాధికారి చిప్ప అనంతం, ఉపాధ్యక్షులు మెట్టు శ్రీనివాస్,సామల సంగన్న జనరల్ సెక్రెటరీ గోస్క శ్రీనివాస్,బాయిని శ్రీనివాస్, పేర్ల కేశవులు,రాములు ఆధ్వర్యంలో శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో కృష్ణ చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం వారిని ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు చిప్ప సరిత, ఉపాధ్యక్షులు కొక్కుల జోత్స,సామల సుజాత, కోశాధికారి అంబటి ఇందు, సభ్యులు స్వరూప, విజయలక్ష్మి ,రూప తదితరులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ ఆలయంలో మాజీ మంత్రి పూజలు

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 13 :**



సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ నియోజకవర్గం లో నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో మాజీ మంత్రి తన్నీరు హరిష్ రావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనూరు మండల పరిధిలోని బోరంచ గ్రామ శివారులో ఉన్న నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో మాజీ మంత్రి హరీష్ రావు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్రెడ్డితో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం నారాయణఖేడ్ లో సర్ కార్యక్రమంలో భాగంగా హజరైన అనంతరం బోరంచకు వెళ్లి దర్శించుకున్నారు. మాజీ మంత్రికి ఆలయ పూజారులు సిద్దు స్వామి, నగేష్ స్వామి ఘనంగా ఆలయంలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహిరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్రెడ్డి,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి తపస్

**చేగుంట వెలుతురు జూలై 13:**



2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జాల సిద్దు అన్నారు. నియామక ప్రక్రియ జరిగినప్పుడు పాత పెన్షన్ విధానం అమలులో ఉంది అని, పరిపాలనా కారణాల వల్ల వారు సిపిఎస్ విధానంలోకి వెళ్లారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 13-07-2026 తేదీన జారీ చేసిన జి.ఓ. ఎం.ఎస్. నం. 53 ద్వారా సంబంధిత ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది అని, వారిని ఆదర్శంగా తీసుకొని డీఎస్సీ 2003 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు శ్రీధర్ రెడ్డి, కిషన్, సతీష్, హవెలి ఘన్ , కొల్చారం మండలాల అధ్యక్షులు బిక్షపతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీల సంఘ భవనానికి రూ. 10 లక్షలు మంజూరు

- గ్రామీణ వైద్యుల సేవలు ప్రశంసనీయం
- ఆర్ఎంపీ నూతన కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ వెల్లడి

**కరీంనగర్ వెలుతురు జూలై 13:**






ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్, కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తొలి వైద్య సేవలు అందించేది ఆర్ఎంపీలేనని అన్నారు. అర్ధరాత్రి అయినా, అత్యవసర పరిస్థితులు వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రాథమిక చికిత్స అందిస్తూ ఎన్నో ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. వైద్య సేవలతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తూ గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు ఆర్ఎంపీలు వెన్నెముకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలు అందించిన ఆర్ఎంపీల సేవలు చిరస్మరణీయమని ఆయన ప్రశంసించారు.ఆర్ఎంపీ సంఘం సొంత భవన నిర్మాణానికి మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అవసరమైతే భవిష్యత్తులో మరో రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు హామీ ఇచ్చారు.ఆర్ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎల్లప్పుడూ తమ పూర్తి సహకారం ఉంటుందని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సహకారంతో సంఘం అభివృద్ధికి అవసరమైన అన్ని విధాలుగా అండగా ఉంటామని మేయర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని నరసింహారావు, ప్రధాన కార్యదర్శి పైడిపల్లి కుమార్, కోశాధికారి కోల సంజీవరెడ్డి, గౌరవాధ్యక్షులు కాసం రవీందర్ రెడ్డి, డాక్టర్లు నౌగాల నరసింహారావు, వసంతరావు, రవీందర్ రెడ్డి, తిరుపతి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్ రావు, నారాయణతో పాటు సంఘం సభ్యులు, ఆర్ఎంపీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలు అమలు చేయకపోతే ఉద్యమం ఉద్ధృతం చేస్తాం





- వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు బి. రాంచందర్...
- నిమ్జ్ అధికారుల బలవంతపు సర్వేలపై రైతుల ఆగ్రహం.. ప్రజావాణిలో ఆర్డీవోకు వినతిపత్రం...

**జహీరాబాద్ వెలుతురు జూలై 13:**

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన నిమ్జ్ భూ బాధిత రైతులు ప్రజావాణి కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. గౌరవ తెలంగాణ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ నిమ్జ్, రెవెన్యూ అధికారులు రైతుల భూముల్లో బలవంతంగా సర్వేలు నిర్వహిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు బి. రాంచందర్ ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ హైకోర్టు W.A. No.537 of 2026లో రైతుల హక్కులను పరిరక్షించాలని, W.P. No.14026 of 2026లో తుది తీర్పు వెలువడే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టరాదని స్పష్టంగా ఆదేశించినప్పటికీ అధికారులు వాటిని అమలు చేయడం లేదన్నారు. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, వారి అనుమతి లేకుండానే భూముల్లోకి ప్రవేశించి సర్వేలు, కొలతలు నిర్వహించడం హైకోర్టు ఆదేశాలకు విరుద్ధమని విమర్శించారు.ప్రస్తుతం W.P. No.38084 of 2025, W.P. No.14026 of 2026, W.P. No.9579 of 2026 కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున తుది తీర్పు వచ్చే వరకు తమ భూముల జోలికి రాకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే తమ భూములను నిమ్జ్ పరిధి నుంచి తొలగించి యథావిధిగా తమకే వదిలివేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా నిమ్జ్ అధికారులు మళ్లీ రైతుల భూముల్లోకి ప్రవేశిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిమ్జ్ బాధిత రైతులు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. తమ సారవంతమైన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.2013 భూ సేకరణ చట్టాన్ని ప్రభుత్వం పూర్తిగా ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేసిన రాంచందర్, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన ఉందా? లేక రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందా? అనే విషయాన్ని ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రంతోనైనా ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎల్గోయి గ్రామానికి చెందిన నిమ్జ్ భూ బాధిత రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై మాజీ మంత్రి హరీష్ సీరియస్

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 13 :**





సంగారెడ్డి :– నారాయణఖేడ్ నుండి జహీరాబాద్ వరకు బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టుల కోసం త్వరలో రైతులు బిఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేస్తామని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సోమవారం నారాయణఖేడ్ కింగ్స్ ప్యాలెస్ లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సర్ ప్రోగ్రాం లో ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త వివిధ గ్రామాల్లో పట్టణాల్లో అందరి ఓట్లు నమోదు చేసేలా ఆక్టివ్ గా పని చేయాలని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. సింగూర్ ప్రాజెక్టు రిపేర్ల పేరిట ఖాళీ చేసి పనులు 30% మాత్రమే పూర్తి చేశారన్నారు. సక్రమంగా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ఎక్కడి నుంచి ఇస్తుందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టులను అటకెక్కించిందని బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఈపాటికి ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్ళు ఇచ్చే వాళ్ళమన్నారు. త్వరలోనే నారాయణఖేడ్ బసవేశ్వరుని సాక్షిగా జహీరాబాద్ లోని కేతకి సంగమేశ్వర్ ఆలయం వరకు రైతులతో పెద్ద ఎత్తున పాదయాత్ర కార్యక్రమాన్ని చేపడతామన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని దేవుళ్ళ మీద ఒట్లు వేసి పనులు చేస్తానని, పనులు చేయకపోగా అడిగిన వాళ్లపై విరుచుకుపడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు హామీలతో మోసపోయారని చెప్పారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, మహిళా విభాగం సభ్యులు,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటు కోల్పోకుండా ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలి

- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి
- దిడ్గి, సత్వార్, తుంకుంట గ్రామాల్లో ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమం....

**జహీరాబాద్ వెలుతురు జూలై 13:**



ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల నర్సింహారెడ్డి అన్నారు.జహీరాబాద్ మండలంలోని దిడ్గి, సత్వార్, తుంకుంట గ్రామాల్లో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), బీఎల్వోలు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పని చేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటర్ల వివరాల సవరణ, డేటా మ్యాపింగ్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ డెస్క్‌ల ద్వారా ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు.దిడ్గి గ్రామంలో నాలుగు, తుంకుంట గ్రామంలో మూడు, సత్వార్ గ్రామంలో ఆరు హెల్ప్‌లైన్ డెస్క్‌లు ఏర్పాటు చేయడంలో కృషి చేసిన గ్రామ అధ్యక్షులు, జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను నర్సింహారెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాములు, కొత్తూర్ మాజీ సర్పంచ్ జగన్మోహన్, దిడ్గి సర్పంచ్ సోమప్ప, సొసైటీ వైస్ చైర్మన్ ఇమామ్ పటేల్, సీనియర్ నాయకులు నర్సింహులు, సత్వార్ సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, తుంకుంట గ్రామ అధ్యక్షుడు సుధాకర్, బీఎల్వోలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిట్టపల్లి సురేందర్ కు మాభూమి డా. దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం

- తెలంగాణను జాగృత పరిచిన కవి దాశరథి
- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**



నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి, తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు తెలంగాణను జాగృత పరిచిన గొప్ప కవి దాశరథి అని హైకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. దాశరథి వంటి కవులు ఆ కాలంలో ఉర్దూ చదివినా.. తెలుగును, సంస్కృతిని కాపాడుతూ వచ్చారన్నారు.మా భూమి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ దాశరథి రంగాచార్య ప్రజా సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి, గాయకుడు మిట్టపల్లి సురేందరు అందజేశారు. రాత్రి వనస్థలిపురం ఎఫ్ సిఐ కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగిన పురస్కార ప్రదానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నా తెలంగాణ కోటి రతణాల వీణ అంటూ తెలంగాణ గొప్పదనాన్ని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు తన సాహిత్యం ద్వారా చెప్పారన్నారు. నాటి నుంచి నేటి వరకు ఆయన రచనలు, పాటలు ఎన్నిసార్లు విన్నా, చదివినా కొత్త గానే ఉంటాయన్నారు. ఆ చల్లని సముద్రగర్భం... పాటతో ప్రపంచ గమనాన్ని తెలియ జెప్పారన్నారు. దాశరథి సాహిత్యంలోని ప్రతి పదం గొప్ప సందేశాన్నిస్తుందన్నారు. అంతగొప్ప పురస్కారాన్ని వర్ధమాన కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్కు అందజేయడం సంతోషకరమన్నారు. సురేందర్ రచనలు ప్రజలందరి హృదయాలను స్పృషిస్తాయన్నారు. తల్లి గురించి వారు రాసిన పాట ప్రతి మనస్సును కదిలిస్తుందన్నారు.ప్రముఖ నటుడు సుమన్ మాట్లాడుతూ... అసలైన హీరోలు బార్డర్లో సైనికులే అని.. దేశ రక్షణలో వారి వల్లే మనం సుఖంగా ఉండగలుగు తున్నామన్నారు. కులాలు మతాలు విడనాడి కలిసిమెలిసి జీవిస్తూ దేశాభివృద్ధికి కృషి చేద్దాం అన్నారు. సాహిత్యం, కలలు ప్రజల్లో సమైక్య భావాన్ని పెంపొందిస్తాయన్నారు. దాశరథి ప్రజా సాహిత్య పురస్కారాన్ని అందుకుంటున్న మిట్టపల్లి సురేందర్ కు అభినందనలు తెలిపారు.చివరగా పురస్కార గ్రహీత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ సమాజంలో మన చుట్టూ జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, కష్ట జీవుల కన్నీళ్లు, కడగల్లే నా పాటకు వస్తువులు అన్నారు. డా దాశరథి సాహిత్యం, రచనలు, పాటలు తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయడానికి తోడ్పడినాయన్నారు. నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఎక్కు పెట్టిన వారి కలం స్ఫూర్తితోనే ఇప్పటికీ ఎప్పటికీ నేను ప్రజల పక్షం నిలుస్తానని అన్నారు. మాభూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక వారు నాకిచ్చిన ఈ దాశరథి సాహిత్య పురస్కారం నాపై బాధ్యత పెంచిందని, ఆ బాధ్యతను దాశరథి, ఇతర ప్రజా కవుల స్పూర్తితో కొనసాగిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు న్యాయమూర్తి మురళీమోహన్, నరసింహ్మప్రసాద్, యానాల నాగిరెడ్డి, ఉదయశంకర్, అలివేలు మంగ,ఇంజమూరి రఘునందన్,ముసుకు పవన్ కుమార్ రెడ్డి, శరణ్య తదితరులు పాల్గొన్నారు. మాభూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక.

# మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్ టర్న్ అండర్‌పాస్‌ను పరిశీలించిన సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్, సన్‌ప్రీత్ సింగ్





**సైబరాబాద్ వెలుతురు జూలై 13:**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్ టర్న్ అండర్‌పాస్‌ను సందర్శించారు. అధికారులు స్థలాన్ని పరిశీలించి, పనులు పూర్తయిన తర్వాత ట్రాఫిక్ సాఫీగా నడిచేలా ఉండేందుకు విలువైన సూచనలు అందించారు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, వాటి కారణంగా ట్రాఫిక్‌పై పడుతున్న ప్రభావాన్ని సమీక్షించి, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.ట్రాఫిక్‌ను సురక్షితంగా, అంతరాయం లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డైవర్షన్ అమలుకు ముందు ట్రయల్ రన్ నిర్వహించి, లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు.నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గేలా ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.ఈ పరిశీలనలో డీసీపీ ట్రాఫిక్–I ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్–I టి. హనుమత్ రావు, ట్రాఫిక్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# జనప్రియ ఎలిసియం బ్రోచర్ ఘన ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి పాల్గొన్నారు

**ఎల్‌బీ నగర్, వెలుతురు జూలై 13:**






బాటసింగారం సమీపంలోని రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న జనప్రియ ఎలిసియం (Janapriya Elysium) విల్లా ప్రాజెక్టు బ్రోచర్‌ను సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి బ్రోచర్‌ను ఆవిష్కరించి, ప్రాజెక్టు విశేషాలను వివరించారు.ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, ప్రకృతి సోయగాల నడుమ అత్యాధునిక సౌకర్యాలతో రూపొందుతున్న ఈ విల్లాలు ప్రశాంతమైన, విలాసవంతమైన జీవనశైలిని అందిస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులో విల్లాను కొనుగోలు చేయడం ద్వారా కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో కూడిన జీవితం గడపవచ్చని అన్నారు.జనప్రియ ప్రతినిధి గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, 25 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్టులో మొత్తం 189 లగ్జరీ విల్లాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాలుష్యరహిత వాతావరణం, అత్యుత్తమ నిర్మాణ ప్రమాణాలు, నగరానికి సమీపంలో ఉన్న అనుకూలమైన ప్రదేశం ఈ ప్రాజెక్టు ప్రత్యేకతలని చెప్పారు. విల్లాల ప్రారంభ ధర రూ.3 కోట్లుగా నిర్ణయించినట్లు వెల్లడించారు.

**ప్రాజెక్టు ముఖ్య విశేషాలు:**

25 ఎకరాల్లో విస్తరించిన ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ
మొత్తం 189 లగ్జరీ విల్లాలు
పిల్లల కోసం విశాలమైన ప్లే ఏరియాలు
ప్రకృతి ఒడిలో ప్రశాంతమైన జీవన వాతావరణం
ఆకర్షణీయమైన స్లోప్ రూఫ్ డిజైన్
అత్యాధునిక క్లబ్ హౌస్, లగ్జరీ సౌకర్యాలు
ప్రత్యేక ప్లే జోన్
ఎత్తైన రూఫ్ డిజైన్‌తో విశాలమైన నివాస అనుభవం
ORR సమీపంలో సమ్మిట్ వ్యూ లివింగ్

**ప్రధాన ప్రాంతాలకు దూరం:**

రామోజీ ఫిల్మ్ సిటీ – 3 కి.మీ.
ఇండస్ట్రియల్ పార్క్ – 5 కి.మీ.
రాజీవ్ గాంధీ అంతర్జాతీయ వి

# విశ్వకర్మలకు శుభవార్త!

**ఐదు వృత్తులను ఒకే కులంగా గుర్తించే ప్రక్రియ ఆరంభం**

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**



కులాన్నే మాయం చేసే కుట్రలతో తీవ్ర ఆందోళనకు గురైన విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల ఇది నిజంగా శుభవార్తే! కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణనలో విశ్వబ్రాహ్మణ కుల ప్రస్తావన లేకపోవడంతో... కార్యాచరణకు దిగిన విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడమే కాకుండా... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లింది. ఐదు వృత్తులను వేర్వేరు కులాలుగా గుర్తించారని, దీని వల్ల అన్ని విధాలా నష్టపోతున్నామని వివరించింది. విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల సమస్యను పరిష్కరించాలని అక్కడే ఉన్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను సీఎం ఆదేశించారు.ఈమేరకు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ బృందం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసింది. విభజించబడిన 5 వృత్తులను తిరిగి ఒక్కటిగా గుర్తించాలని కోరింది. వెంటనే మంత్రి పొన్నం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు ఫోన్ చేసి విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సమస్యను పరిష్కరాల్సిందిగా ఆదేశించారు. ఆ వెంటనే జేఏసీ బృందం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయానికి వెళ్లి, చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు తిరుమల సురేందర్, రాపోలు జయప్రకాశ్‌లను కలిసి... ఐదు వృత్తులను గతంలో లాగే విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేసింది. సమస్యను సావధానంగా విన్న చైర్మన్ నిరంజన్, వచ్చే వారం జరిగే బీసీ కమిషన్ సమావేశంలో ఈ మేరకు చర్చించి ఆమోదిస్తామని, ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు. విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ బృందంలో దేవరకొండ కాళిదాస్, భూంపల్లి రాజమౌళి చారి, కాంగ్రెస్ పార్టీకి చెందిన భువనగిరి చైర్‌పర్సన్ తంగళ్లపల్లి రవికుమార్, విశ్వకర్మ ఫౌండేషన్ చైర్మన్ అధ్లూరి రవీంద్రా చారి, వేదాస్ అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

# షాబాద్ ఆరు హత్యల కేసులో నిందితుడు ఆత్మహత్య?

- పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహం కలకలం
- తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన నరమేధం కేసులో కీలక పరిణామం
- పెంజర్లలో వెంచర్‌లో రాజ్‌కుమార్ మృతదేహం గుర్తింపు
- మృతదేహం సమీపంలో విషం సీసా సీజ్ చేసిన పోలీసులు
- ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానం
- 14 ప్రత్యేక బృందాలతో మూడు రోజులుగా కొనసాగిన గాలింపు

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 13:**




తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన రంగారెడ్డి జిల్లా షాబాద్ ఆరు హత్యల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్‌కుమార్ (29) సోమవారం మృతిచెందిన స్థితిలో కనిపించాడు. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిధిలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి డయల్–100కు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మృతుడు రాజ్‌కుమార్ అని నిర్ధారించారు.మృతదేహం సమీపంలో విషం సీసా లభించడంతో రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే మరణానికి గల ఖచ్చితమైన కారణాలు, ఇతర పరిస్థితులపై పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.గత శుక్రవారం అర్ధరాత్రి షాబాద్‌లో రాజ్‌కుమార్ అమానుషంగా నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. ఓ బాలికను వేధించిన కేసులో తనపై పోక్సో చట్టం కింద కేసు నమోదైందనే కక్షతో అతడు మొదట బాలిక తల్లి, నానమ్మలను కత్తితో హత్య చేశాడు. అనంతరం బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి గొంతుకోసి చంపాడు. ఆ తర్వాత తన ఇంటికి వెళ్లి భార్యతో పాటు నిద్రిస్తున్న ఇద్దరు చిన్నారుల గొంతులు కోసి హతమార్చాడు.కేవలం అరగంట వ్యవధిలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు చిన్నారులను కిరాతకంగా హత్య చేయడంతో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మర గాలింపు చేపట్టారు. హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై హోటళ్లు, లాడ్జీలు, దాబాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించడంతో పాటు నిందితుడి కుటుంబ సభ్యులు, సన్నిహితులను కూడా విచారించారు.ఈ క్రమంలోనే పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహం లభించడంతో కేసు దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు త్వరలో వెల్లడించనున్నారు.

# రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ప్రజావాణికి 103 ఫిర్యాదులు

- ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 13:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొం గరకలాన్ రంగారెడ్డి జిల్లా కార్యా లయం సోమవారంసమీకృ త జిల్లాకార్యాలయాల సముదాయ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లాకలెక్టర్ సి.నారా యణరెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు ఈకార్యక్రమంలో మొత్తం103 ఫిర్యాదులు అందా యి ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసంప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించా రు ప్రజలు సమర్పించిన ప్రతివినతిని సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పెండిం గ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రజలకు పారదర్శకంగా జవాబుదారీతనంతో సేవలు అందించాలని అధికారులను ఆదే శించా రుప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూశాఖకు 23 ఇతర శాఖలకు80 మొత్తం103 దరఖాస్తులు అందాయి ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి కె చంద్రారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి శారద వివిధ శాఖలజిల్లా అధికారులు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు సంబంధిత అధికారులు తది తరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- బంజారాహిల్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్
- నులిపురుగుల నివారణతో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గుతాయని వెల్లడి.
- పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదల, ఏకాగ్రతకు ఆల్బెండజోల్ మాత్రలు కీలకమని సూచన.
- అర్హులైన ప్రతి బాలబాలికకు మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం.





**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎన్‌బీటీ నగర్‌లో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రలు పిల్లల్లో ఉండే నులిపురుగులను నివారించి రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదలలో జాప్యం వంటి సమస్యలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి, మెరుగైన ఏకాగ్రతతో విద్యాభ్యాసం కొనసాగించడానికి నులిపురుగుల నివారణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి బాలబాలికకు ఆల్బెండజోల్ మాత్రలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పి. శ్రీధర్, ఎస్పీహెచ్‌ఓ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ సాయిబాబా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరుణ్‌తో పాటు ఇతర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీలను కించపరిచే విధంగా ఎవరు మాట్లాడినా ఊరుకునేది లేదు

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**



యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డినీ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని రాహుల్ గాంధీ గారికి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బీసీల పట్ల ఎవరు కించపరిచే విధంగా విధంగ మాట్లాడిన ఊరుకునేది లేదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇప్పుడిప్పుడే రాజకీయంగా ఎదుగుతున్న కొన్ని బీసీ కులాలను కావాలనే కొంతమంది నోటి కొచ్చినట్లు అవాకులు చవాకులు పేలుతున్నారని రాజకీయంగా మీ ఎదూగుదలకు బీసీలను వాడుకుంటూ బీసీల పట్ల కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని ఇది సరికాదన్నారు.

# అంతరిక్ష విజ్ఞానంపై ప్రత్యేక అవగాహన సదస్సు

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 13:**

స్థానిక శంకర్‌పల్లిలోని 'పీఎం శ్రీ టీజీఎంఎస్' పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇస్రో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ గంజి వెంకట నారాయణ గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ), మరియు పదో తరగతి విద్యార్థులతో దాదాపు మూడు గంటల పాటు డిజిటల్ ఇంటరాక్షన్ పద్ధతిలో సుదీర్ఘంగా ముచ్చటించారు. 'స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ' (అంతరిక్ష విజ్ఞానం-సాంకేతికత) లోని నూతన ఆవిష్కరణలను, విశేషాలను డిజిటల్ స్క్రీన్ల ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొని, అంతరిక్ష పరిశోధనలపై తమకున్న సందేహాలను



అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చొరవను, వారిలోని జిజ్ఞాసను గమనించిన సైంటిస్ట్ వెంకటనారాయణ గారు.. సదస్సులో చురుగ్గా పాల్గొని, చక్కని ప్రశ్నలు అడిగిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందజేసి అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతరిక్ష పరిశోధ



నలపై ఇలాంటి అద్భుతమైన అవగాహన కల్పించేందుకు సమయం కేటాయించినందుకు గానూ ఇస్రో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ గంజి వెంకట నారాయణ గారికి పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# నులిపురుగుల నిర్మూలనతోనే పిల్లల్లో సంపూర్ణ ఎదుగుదల..

**శంకర్ పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ"**

**శంకర్ పల్లి, వెలుతురు జులై 13:**

పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి, శారీరక ఎదుగుదలకు నులిపురుగుల నిర్మూలన ఎంతో అవసరమని శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని, స్థానిక మోడల్ స్కూల్ నందు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ , వైస్ చైర్పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, మరియు ఏఎంసీ చైర్మన్ గోవిందమ్మగోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, తమ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ రేవతి ఆధ్వర్యంలో 1 నుండి 19 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలందరికీ 'అల్బెండజోల్ 400 ఎమ్ జి' మాత్రలను పంపిణీ చేశారు.

**వైద్యుల సూచనలు**

1-2 సంవత్సరాల పిల్లలకు: సగం మాత్రను (200 ఎమ్ జి) పొడి చేసి తినిపించాలి. 2-19 సంవత్సరాల పిల్లలకు ఒక పూర్తి మాత్రను పొడి రూపంలో లేదా నమిలి మింగించాలి.

**మాత్రల వల్ల కలిగే ప్రయోజనాలు**

ఎదిగే పిల్లల్లో నులిపురుగులను పూర్తిగా నిర్మూలిస్తుంది.పిల్లల రోగనిరోధక శక్తిని (ఇమ్యూనిటీ) పెంచుతుంది.రక్తహీనత (ఎనిమియా) లోపాన్ని నివారిస్తుంది. కడుపునొప్పి వంటి సమస్యల నుండి పిల్లలను కాపాడి, చక్కటి ఎదుగుదలకు తోడ్పడుతుంది. ఈ రోజు నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులందరికీ ఈ మాత్రలను విజయవంతంగా అందించారు. తప్పిన వారికి 20వ తేదీన 'మాప్ అప్ డే':ఇవాళ వివిధ కారణాల వల్ల అల్బెండజోల్ మాత్రలు వేసుకోలేకపోయిన పిల్లల కోసం ఈ నెల 20వ తేదీన ప్రత్యేకంగా 'మాప్ అప్ డే' నిర్వహిస్తున్నట్లు వైద్య అధికారులు తెలిపారు. ఆ రోజున మిగిలిపోయిన పిల్లలందరికీ తప్పకుండా మాత్రలు అందిస్తామని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని శంకర్ పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రేవతి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆరుట్ల కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో 19వ సోమవారం అన్నదాన కార్యక్రమం

- **ఈ సోమవారం అన్నదాన ప్రభువుఎస్ ఎల్ యాదయ్యగౌడ్ తనయుడు సుంకరి ప్రవీణ్ కుమార్ గౌడ్**

**మంచాల వెలుతురు జులై 13:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామం కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో ప్రతిసోమవారం గౌడ సంఘం పెద్దల సహకారంతో దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగారి యాదగిరి ఉదయాన్నే దేవాలయం శుభ్రం చేసి కంఠమహేశ్వర స్వామికి శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు ఈ సోమవారం అన్నదాన ప్రభువు సుంకరి ప్రవీణ్ కుమా ర్ గౌడ్ దంపతులు అయప్ప సన్నిధానం గురుస్వామి కావాలి శ్రీనివాస్ ముదిరాజ్ లొంగరి దాసు నూకం రాజు ముదిరాజ్ గౌడ సంఘం పెద్దలుగ్రామస్తులు ముందుగా కంఠమహేశ్వర స్వామికి శివ లిం గానికి ప్రత్యేకపూజలు చేశారు అన్నదాన అనంతరం సుంకరి ప్రవీణ్ కుమార్ గౌడ్ దంపతు లు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు ఈకార్యక్రమంలో గౌడసంఘం పెద్దలు సుంకరి జంగ య్యగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ భక్తులు మొర్రి ఐలయ్య మొద్దు కిషోర్ రెడ్డి గోగి రెడ్డి జ్ఞానేశ్వర్ రెడ్డి దొడ్డి జంగయ్యభక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.



# అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ శ్వేత

- **హన్మకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంత్రి సురేఖతో భేటీ అయిన వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు సత్య శారద, చాహత్ బాజ్ పాయ్, పోలీస్ కమిషనర్ శ్వేత**
- **ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మహిళలు, చిన్నారుల భద్రత, శాంతిభద్రతలు, నేర నియంత్రణ తదితర అంశాల పై చర్చ**

**వరంగల్ వెలుతురు జూలై 13:**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేత ఈ రోజు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారిని హన్మకొండలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సురేఖ నూతన కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతలతో



హన్మకొండ, వరంగల్ జిల్లాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు మెరుగైన సేవల కల్పన, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, వుమెన్ సేఫ్టీ తదితర వివిధ అంశాల పై వారు చర్చించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, వేగవంతమైన, పారదర్శక పాలనను అందించాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేయాలని మంత్రి వారికి దిశా నిర్దేశం చేశారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) హెల్ప్ డిస్క్ కార్యక్రమాన్ని పరిశీలించిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 13:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277వ డివిజన్ మహాదేవపురం పరిధి దేవేందర్ నగర్ గాజులరామారం సర్కిల్ AERO ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) హెల్ప్ డిస్క్ కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని అధికారులను కోరారు.ప్రజలు కూడా బీఎల్ఓలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను



సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం సామాజిక బాధ్యత అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ళ సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ గణేష్, ఐ.ఎన్.టి.యూ.సి నాయకులూ దేగుల సతీష్ బాబు, లలిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు ఆక్రమణలను అడ్డుకోండి

**జోనల్ కమిషనర్ కి సిపిఐ వినతిపత్రం అందజేత**

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 13:**

కుత్బుల్లాపూర్ జోనల్ పరిధి చింతల్ సర్కిల్, మహాదేవపురం, గాజులరామారం సర్కిళ్లు రోడ్డులను ఆక్రమించుకుంటూ నిర్మాణాలు సాగిస్తున్నారని దీంతో రాకపోకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని, ఈవిషయాన్ని గతంలో కూడా అన్ని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆఫీసుల్లో వినతిపత్రం ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోలేదని వెంటనే రోడ్లు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ని కోరారు. జగద్గిరిగుట్ట పరిధిలోని పైప్లైన్ రోడ్ సిపిఐ ఆఫీస్ లైన్, బీరప్ప నగర్ కొత్తగా వేసిన రోడ్డులపై నిర్మాణాలు జరుగుతున్నాయని గతంలో మున్సిపల్ సిబ్బంది తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడం మళ్లీ అవి ఇప్పుడు శాశ్వత నిర్మాణాలుగా మారే ప్రమాదం ఉంది. వెంటనే మరోసారి అలాంటి నిర్మాణాలు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవిషయాలపై స్థానిక సిబ్బందికి తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవట్లేదని, దీనిపై ప్రజల్లో అనేక అపోహాలు ఉన్నాయని స్థానిక సిబ్బంది వారికి సహకరిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారని కాబట్టి ప్రభుత్వంపైన చెడ్డ పేరు రాకుండా ఎలాంటి పక్షపాతం లేకుండా విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రజలకు ఎలాంటి కష్టాలు ఉండవని జోనల్ కమిషనర్ కి చెప్పారు. రావి నారాయణరెడ్డి నగర్ లో బాక్స్ నాలను నిర్మించే సమయంలో రోడ్డును తవ్వి వదిలేయడం వల్ల ప్రజలకు వెళ్లడానికి తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు సదానంద్, సహదేవరెడ్డి, వెంకటేష్, కొండయ్య, శ్రీనివాస్, జంబవా మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

- **రాష్ట్రవ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం ప్రారంభం**
- **33 జిల్లాల్లో 96.81 లక్షల మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**
- **1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రను తప్పక అందించాలి.**

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

రాష్ట్రంలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ కార్యక్రమం పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.సోమవారం రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం-2026 సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఖైరతాబాద్ శాసన సభ్యులు దానం నాగేందర్ లతో కలసి మంత్రి పాల్గొని రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను మంత్రి స్వయంగా అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 96,81,855 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. నులిపురుగుల సమస్య చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యపై ప్రభావం చూపుతుందని అన్నారు. నులిపురుగుల కారణంగా రక్తహీనత, పోషకాహార లోపం, కడుపునొప్పి, విరేచనాలు, శారీరక బలహీనత, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు."చిన్నారులు ఆరోగ్యంగా, చురుకుగా ఉండడంతో పాటు చదువులో క్రమం తప్పకుండా కొనసాగాలి. నులిపురుగుల నివారణ ద్వారా సంబంధిత ఆరోగ్య సమస్యలను తగ్గించడంతో పాటు పోషక స్థితి, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడుతుందని, ఏ ఒక్క చిన్నారి కూడా మాత్ర తీసుకోకుండా మిగిలిపోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది చర్యలు తీసుకోవాలి" అని మంత్రి అన్నారు.కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యాశాఖ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రభుత్వ సహాయంతో



నడిచే, ప్రైవేట్ పాఠశాలలు, ప్రీ-స్కూల్స్, మదర్సాలు, జూనియర్ కళాశాలల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థకు వెలుపల ఉన్న 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 10,28,013 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు.నిర్దేశిత మోతాదు ప్రకారం పిల్లలకు అందించాలని మంత్రి సూచించారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం రోజున



గైర్హాజరైన, అనారోగ్యంతో ఉన్న లేదా మాత్ర తీసుకోలేకపోయిన చిన్నారుల కోసం జూలై 20న మాప్-అప్ డే నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పిల్లల్లో మట్టి ద్వారా సంక్రమించే నులిపురుగుల సమస్యను తగ్గించేందుకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కలుషితమైన మట్టి, ఆహారం, నీటి ద్వారా నులిపురుగుల సంక్రమణ జరిగే అవకాశం ఉందని తెలిపారు. నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం, సంబంధిత ఆరోగ్య సమస్యలను తగ్గించి చిన్నారులు మరింత ఆరోగ్యంగా, చురుకుగా ఉండేందుకు దోహదపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యానారాయణ, వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ విజయ నిర్మల , జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా . పి. శ్రీనివాస్, డి. ఐ ఓ డా.శ్రీధర్, వైద్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి: ఎంబీ కృష్ణ యాదవ్

- **తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ జేఏసీ సమావేశం.**



**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ జేఏసీ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ జేఏసీ కన్వీనర్, టీజీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, న్యాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యమకారుల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని ఎంబీ కృష్ణ యాదవ్ స్పష్టం చేశారు.

## కోతి రాంపూర్‌లో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 13:**



కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 10వ డివిజన్‌లోని కోతి రాంపూర్ గిద్దె పెరుమండ్ల గుడి సమీపంలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన రహదారులు, మెరుగైన డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య సేవలు అందించే దిశగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండదని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా ప్రతి పనిని అధికారులు పర్యవేక్షిస్తూ పూర్తి చేయాలని సూచించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డివిజన్ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా చేపడుతున్నామని, ప్రజల సహకారంతో కరీంనగర్ నగరాన్ని మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మేయర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గారు, స్థానిక 10వ డివిజన్ కార్పొరేటర్ సొగాని కొమురయ్య గారు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువకులు, మహిళలు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



**NDD కార్యక్రమాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ డా. కిరణ్ మయి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 13:**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నల్లకంచె ,గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల మరియు కళాశాలలో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం \(National De-worming Day \- NDD\) కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్ మయి విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల్లో నులి పురుగుల నివారణ ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని అర్హులైన ప్రతి చిన్నారికి ఈ మాత్రలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన బాలబాలిక తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. షీబా, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. సత్యరత్న, వైద్య అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థినులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రూ. 3. 12 కోట్ల హ్యాష్ ఆయిల్ స్వాధీనం



- **రెండు వేర్వేరు కేసుల్లో ఏడుగురు అదుపులో**

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ రహిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ క్రమంలో నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో మొత్తం రూ.3.12 కోట్ల విలువైన హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.మొదటి కేసులో ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ సమీపంలో నిర్వహించిన దాడిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.2.96 కోట్ల విలువైన 23.706 లీటర్ల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.మరో కేసులో జూబ్లీహిల్స్ రోడ్ నెం.10 ప్రాంతంలో ముగ్గురు డ్రగ్ పెడ్లర్లు, ఇద్దరు వినియోగదారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.16 లక్షల విలువైన 1.250 లీటర్ల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.డ్రగ్స్ యువత భవిష్యత్తును, కుటుంబాలను, కెరీర్‌లను నాశనం చేసే సామాజిక మహమ్మారిగా మారాయని సీవీ ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. విలాసవంతమైన జీవితానికి ఆశపడి లేదా వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు.డ్రగ్స్ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన ఎలాంటి అనుమానాస్పద సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను మాదకద్రవ్యాల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

## జూలై 24లోగా ఎస్ఐఆర్ (SIR-2026) ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం

- **అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో జిల్లా యంత్రాంగం విస్తృత చర్యలు – జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 13:**





ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR–2026) ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR–2026) ప్రక్రియను జూలై 24 చివరి తేదీలోగా పూర్తి చేయడం జిల్లా యంత్రాంగం లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది, స్థానిక సంస్థల సిబ్బంది, ప్రత్యేక బృందాలను సమన్వయంతో వినియోగిస్తూ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటైజేషన్ పనులను వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు.ఎస్ఐఆర్ (SIR–2026) ప్రక్రియపై అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ఒరియెంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి, ప్రక్రియ నిర్వహణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటైజేషన్ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో విధులు నిర్వహించేలా అవసరమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.ప్రతి అర్హత గల ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం చేరేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఫారాలు పూర్తి వివరాలతో సేకరించి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు.అర్హులైన ఓటర్లు ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా జూలై 24లోగా తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (BLOలు) తప్పనిసరిగా అందజేసి ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR–2026) ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఎస్సీల అభివృద్ధికి కేంద్రం సహకరించాలి.. జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

- **జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానాతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.**
- **కుల వివక్ష నిర్మూలనకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి.**
- **ఎస్సీలకు జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం.**
- **ఎస్సీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి.**

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**





జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమం, విద్య, సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని, విద్యార్థులకు పాఠశాలల్లోనే అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నామని వెల్లడించారు. ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ సంఖ్యను పెంచుతున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నామని, రాజకీయాలతో పాటు ఇతర కీలక రంగాల్లోనూ ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం తెలిపారు. ఎస్సీ వర్గీకరణను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఎస్సీల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందించేలా జాతీయ ఎస్సీ కమిషన్ చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## సింగరేణిలో రూ. 1,600 కోట్ల బొగ్గు మాయం.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

- **సింగరేణిలో అవకతవకలు, కార్మికుల సమస్యలపై మరోసారి గళమెత్తిన బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.**
- **రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని సంచలన ఆరోపణలు.**
- **బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని దోపిడీకి కేంద్రంగా మార్చాయని విమర్శలు.**
- **కేంద్రం కేటాయించిన బొగ్గు బ్లాకులతో సింగరేణి భవిష్యత్తుకు 45 ఏళ్ల భరోసా లభించిందని వ్యాఖ్యలు.**

**శ్రీరాంపూర్ వెలుతురు జూలై 13:**





సింగరేణిలో జరుగుతున్న అవకతవకలు, కార్మికుల సమస్యలు, సంస్థ ఆర్థిక పరిస్థితిపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. కేవలం నెల వ్యవధిలోనే రెండోసారి సింగరేణి ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, 'సింగరేణి భరోసా' కార్యక్రమానికి కొనసాగింపుగా సంస్థలో జరుగుతున్న అక్రమాలను ప్రజల ముందుకు తీసుకొచ్చారు.సింగరేణిలో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు, రూ.1,600 కోట్ల విలువైన సంపద మాయమైందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై శ్రీరాంపూర్ గనిని పరిశీలించేందుకు వెళ్లిన బీజేపీ ప్రజాప్రతినిధులను ప్రభుత్వం అడ్డుకుని అరెస్టు చేసిందని విమర్శించారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తాడిచర్ల-2, నైనీ బొగ్గు బ్లాకులను బహిరంగ వేలం లేకుండా సింగరేణికి కేటాయించడం ద్వారా సంస్థకు 45 ఏళ్ల భవిష్యత్తుపై భరోసా కల్పించిందన్నారు. ఈ నిర్ణయంతో రూ.2,550 కోట్ల వేలం ప్రీమియం భారం తప్పడంతో పాటు వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు రక్షించబడ్డాయని తెలిపారు.తెలంగాణ డిస్కంలు, జెన్‌కో కలిపి సింగరేణికి రూ.54,148 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఇందులో విద్యుత్ సరఫరాకు రూ.28,876 కోట్లు, బొగ్గు సరఫరాకు రూ.25,272 కోట్లు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ బకాయిలు విడుదల చేయకుండా కార్మికుల సంక్షేమం ఎలా సాధ్యమవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని అభివృద్ధి చేయకుండా అవినీతి కేంద్రంగా మార్చాయని ఆరోపించిన మహేశ్వర్ రెడ్డి, కాగ్ నివేదికల్లో నమోదైన ఓబీఆర్ కాంట్రాక్టులు, రవాణా, ఇసుక కొనుగోళ్లు, థర్మల్ పవర్ ప్లాంట్, సోలార్ ప్రాజెక్టులు, డీజిల్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లలో వందల కోట్ల రూపాయల నష్టం జరిగిందని ఆరోపించారు. తాడిచర్ల-1 బ్లాక్, ఇతర కాంట్రాక్టులు, టెండర్లపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కోరారు.సింగరేణిలో కార్మికులకు న్యాయం జరగాలంటే, సంస్థ లాభాల్లో నడవాలంటే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడాల్సిందేనని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ SC మోర్చా ప్రధాన కార్యదర్శిగా పారంద మహేష్

- **మరోసారి నాపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 13:**

రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ SC మోర్చా ప్రధాన కార్యదర్శిగా మరోసారి నాపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు

రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి గారికి జిల్లా SC మోర్చా అధ్యక్షులు కృష్ణ ప్రకాష్ గారికి ప్రధాన కార్యదర్శులు బండారి భాస్కర్ అన్న, యశ్పాల్ గౌడ్ గారికి మాజీ కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు కళ్లెం రవీందర్ రెడ్డి గార్లకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన పారంద మహేష్, పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, భారతీయ జనతా పార్టీ ఆశయాలకు అనుగుణంగా పూర్తి నిబద్ధతతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను.ఈ సందర్భంగా నన్ను ప్రోత్సహించిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు. మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలి.



# ఎన్‌సీఎస్‌సీ ద్వారా గత రెండేళ్లలో పరిష్కారమైన కేసులు 60,000కు మాటే

- **ఎన్‌సీఎస్‌సీ ఛైర్మన్ శ్రీ కిషోర్ మక్వానా**
- **ఆధునికీకరించిన ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించిన ఛైర్మన్**
- **ఎన్‌సీఎస్‌సీ హైదరాబాద్ కార్యాలయ పరిధిలో 10,800కు పైగా ఫిర్యాదుల పరిష్కారం, బాధితులకు రూ.33.8 కోట్ల పరిహారం**

**హైదరాబాద్, వెలుతురు 2026 జులై 13:**

గడచిన రెండేళ్ల కాలంలో 60,000కు పైగా కేసులను పరిష్కరించి జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) చరిత్ర సృష్టించిందని ఎన్‌సీఎస్‌సీ ఛైర్మన్ శ్రీ కిషోర్ మక్వానా అన్నారు. సోమవారం రోజున హైదరాబాద్ కవాడిగూడలో ఉన్న సీజీవో టవర్స్‌లో ఆధునికీకరించిన కమిషన్ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఎస్‌సీ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాంచందర్, ఎన్‌సీఎస్‌సీ కార్యదర్శి శ్రీ గుడే శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీఎస్‌సీ ఛైర్మన్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు న్యాయాన్ని అందించేందుకు, వారి హక్కులను పరరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌సీఎస్‌సీ కార్యాలయాలు కృషి చేస్తున్నాయని తెలియజేశారు. రాజ్యాంగంలోని 338 అధికరణకు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కమిషన్ పనిచేస్తోందని తెలియజేశారు. గత 75 ఏళ్లుగా షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణకూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కమిషన్ అవిశ్రాంతంగా కృషి చేస్తోందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా గడచిన రెండేళ్లలో 60,000కు పైగా కేసులను పరిష్కరించామనీ, ఇది కమిషన్ చరిత్రలోనే అత్యధికమని ఆయన తెలియజేశారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం, హక్కుల రక్షణ ముఖ్యమైన అంశాలని ఛైర్మన్ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుదారునికి సకాలంలో న్యాయం అందించాలనే డాక్టర్ అంబేద్కర్ కలను సాకారం చేసేందుకు కమిషన్ కట్టుబడి ఉంటుందని చెప్పారు.జవాబుదారీతనాన్ని పెంచేందుకు కమిషన్లో అమలు చేస్తున్న బలమైన, చట్టపరమైన యంత్రాంగాల గురించి ఎన్‌సీఎస్‌సీ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాంచందర్ వివరించారు. అవసరమైనప్పుడు నోటీసులను, సమన్లను జారీ చేయడానికీ, ఆదేశాలను పాటించని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడానికీ ఎన్‌సీఎస్‌సీకి పూర్తి అధికారాలున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ– ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రస్తుతం అందుతున్న ఆర్థిక సాయం గురించి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ అభివృద్ధికి, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని ప్రజా ప్రతినిధులు, విధాన రూపకర్తలను ఆయన కోరారు. సమస్యలను పరిష్కరించడంలో, సమగ్రాభివృద్ధిని ప్రోత్సహించడంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కమిషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఫిర్యాదు పరిష్కారంలో జాప్యాన్ని తొలగించడానికీ, సామర్థ్యాన్ని విస్తరించడానికీ డిజిటల్ సాధనాలను, ఆధునిక మౌలిక వసతులను ఉపయోగించుకొనేందుకు కమిషన్ కట్టుబడి ఉందని ఎన్‌సీఎస్‌సీ కార్యదర్శి గుడే శ్రీనివాస్ తెలియజేశారు. అసలైన లబ్ధిదారులకు ప్రయోజనాలు, చట్టపరమైన రక్షణ అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల మధ్య విస్తృత సహకారం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రాంతీయ శాఖ పనితీరు గురించి ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ జీ సునీల్ కుమార్ బాబు వివరించారు. 2024–2026 మధ్య కాలంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన శాఖల్లో హైదరాబాద్ ఒకటని ఆయన వెల్లడించారు. ఈ సమీక్షా కాలంలో 10,853 ఫిర్యాదులను పరిష్కరించి.. రాజ్యాంగ హక్కులను పరిరక్షించడడంలో హైదరాబాద్ కార్యాలయం కీలకపాత్ర పోషించింది. అదేవిధంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల (అట్రాసిటీ నిరోధక) చట్టంలోని నిబంధనల ప్రకారం బాధితులకు రూ.33.80 కోట్ల నష్టపరిహారాన్ని అందజేసింది. షెడ్యూలు కులాల హక్కుల తీవ్ర ఉల్లంఘనలకు సంబంధించిన 177 సుమోటో కేసులను నమోదు చేయడంతో పాటు, ఫిర్యాదుదారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులతో 127 చట్టబద్ధమైన విచారణలను కూడా నిర్వహించింది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ కార్పొరేషన్ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, వివిధ షెడ్యూలు కుల సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

———

బడి బతికితేనే భవిష్యత్తు తెలంగాణ

"మాట ఒకటి, చేత ఒకటా? విద్యారంగ బలోపేతం పేరుతో బడుల కుదింపు"

తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, "తరగతి గదిలోనే సమాజం రూపుదిద్దుకుంటుంది" అని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. జూన్ 17న రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామంలో `తెలంగాణ విద్యా – TVS–P` పాఠశాలను ప్రారంభిస్తూ ఈ మాటలు చెప్పారు. విద్య పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అని ప్రభుత్వం చెప్తోంది.కానీ అదే జూన్ నెలలో ముఖ్యమంత్రి గారు చేసిన మరో రెండు ప్రకటనలు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తే మాటలకు చేతలకు పొంతన కుదరడం లేదు.జూన్ నెలలో `ది హిందూ` పత్రిక నిర్వహించిన చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలోని ★27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదిస్తాము★ అని సంచలన ప్రకటన చేశారు. అంటే దాదాపు 23 వేల పాఠశాలలను మూసివేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పినట్టే. ఇదే నెలలో ఢిల్లీలో జరిగిన `నీతి అయోగ్` సమావేశంలో మాట్లాడుతూ ★"దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది"అని ఉద్ఘాటించారు.మరి 23 వేల బడులు మూస్తే ఆ పునాది ఎలా బలపడుతుంది? ఇదే ప్రశ్నను తెలంగాణలోని లక్షలాది తల్లిదండ్రులు, విద్యావేత్తలు, అడుగుతున్నారు.` ప్రభుత్వ పాఠశాలలు ఇప్పటికే మూతపడ్డాయి. ఇంకా 6000 పాఠశాలలు మూసేయడానికి ప్రతిపాదనలు ఫైనల్ దశలో ఉన్నాయి. మొత్తంగా 23 వేల పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీని వల్ల 8000 గ్రామాల్లో పాఠశాలలే లేకుండా పోయే ప్రమాదం ఉంది. పాఠశాలల సంఖ్య తగ్గిస్తూనే 119 ఉపాధ్యాయ పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఒక ఉపాధ్యాయుడు మూడు నుండి నాలుగు తరగతులు చూసుకునే దుస్థితి ఉంది. బడుల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. మంచినీరు, మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ లేని బడులు వేలల్లో ఉన్నాయి.






### నాణ్యత పెరిగిందా?

బడులు తగ్గిస్తే నాణ్యత పెరుగుతుందని ప్రభుత్వ వాదన. కానీ `NIRF` ర్యాంకింగ్ లు వేరే కథ చెప్తున్నాయి. NIRF ర్యాంకింగ్ లో తెలంగాణ 28వ స్థానం నుండి 20వ స్థానానికి పడిపోయింది. రాష్ట్రంలో 783 కళాశాలలు ఉంటే, 28 జిల్లాల నుండి కేవలం 300 నుండి 675 ర్యాంకుల్లోనే ఉన్నాయి. అంటే బడులు మూస్తే ర్యాంక్ రావడం లేదు సరికదా, ఇంకా దిగజారుతోంది.

### RTE 2009 కి తూట్లు

విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి పిల్లవాడికి తన ఇంటికి 1 కి.మీ లోపు ప్రాథమిక పాఠశాల ఉండాలి. కానీ "విలీనం" పేరుతో చిన్న బడులను మూసి పెద్ద బడుల్లో కలపడం వల్ల పిల్లలు ఇప్పుడు 3 నుండి 5 కి.మీ నడవాల్సి వస్తోంది. గ్రామీణ పేద తల్లిదండ్రులు ఆర్థికంగా అంత దూరం పంపలేక పిల్లలను బడి మాన్పిస్తున్నారు. ఫలితంగా డ్రాపౌట్ రేటు ప్రమాదకరంగా పెరుగుతోంది.గురుకులాలు, `TVS–P` స్కూళ్లు బాగున్నాయి. కానీ అవి 10% మంది పిల్లలకు మాత్రమే. మిగిలిన 90% సామాన్య, పేద, గ్రామీణ పిల్లలకు దగ్గరలో బడి లేకపోతే వారి భవిష్యత్తు ఏమిటి? వారి చదువు ఎవరు బాధ్యత తీసుకుంటారు?

### సూటిగా చెప్పాలంటే

విద్యారంగ బలోపేతం గురించి ప్రసంగాలు చేస్తూనే, ఆచరణలో ప్రభుత్వ విద్యను లక్షలాది విద్యార్థులకు, వేలాది గ్రామాలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ఇది బలోపేతం కాదు. ఇది ప్రభుత్వ విద్యను ప్రజలకు దూరం చేసే కార్యక్రమం. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు లబ్ది చేకూర్చే కుట్రగా దీన్ని చూడాల్సి వస్తోంది.తెలంగాణ ఉద్యమం "నీళ్లు, నిధులు, నియామకాలు" కోసమే కాదు, "ప్రతి గ్రామానికి బడి" కోసం కూడా జరిగింది. "మా పిల్లలకు మంచి బడులు కావాలి" అని లక్షలాది మంది నినదించారు. ఇప్పుడు స్వరాష్ట్రంలోనే బడులు మూస్తుంటే ఇది ఆ త్యాగాలకు ద్రోహం కాదా?

1. 27 వేలను 4 వేలకు కుదించే ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలి.★ బడుల మూసివేత, విలీనం ప్రక్రియను పూర్తిగా ఆపాలి.

2. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలి. విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి పాటించాలి.

3. ప్రతి బడికి మౌలిక సదుపాయాలు
కల్పించాలి. బడ్జెట్ లో విద్యకు కేటాయింపులు పెంచాలి.

4.RTE 2009 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.
ప్రతి పిల్లవాడికి ఇంటి దగ్గర బడి హక్కును కాపాడాలి.

5. నాణ్యత పెంపునకు టీచర్ ట్రైనింగ్, సిలబస్ అప్డేట్, డిజిటల్ సదుపాయాలపై దృష్టి పెట్టాలి.తరగతి గదిలోనేసమాజం రూపుదిద్దుకుంటుందని సీఎం గారు అన్నారు. మరి ఆ తరగతి గదినే మూసేస్తున్నారు. ఒక బడి మూతపడితే ఒక ఊరి భవిష్యత్ ఏమిటి?ఒక తరమే చీకట్లోకి వెళ్తుంది.ప్రభుత్వం వెంటనే స్పందించి బడులను కాపాడాలి. ఎందుకంటే బడి బతికితేనే భవిష్యత్తు తెలంగాణ, ప్రభుత్వ బడులు బతికితేనే బంగారు తెలంగాణ.భూపతి వెంకటేశ్వర్లు రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం

# రాష్ట్ర విశాల ప్రయోజనాల సాధనే లక్ష్యంగా పని చేయాలి...

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

తెలంగాణ రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో కలిసి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం కోరారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎంపీలకు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ జనాభాలో 10 శాతం జనాభా ఆరు మహా నగరాల్లో ఉందని, అయితే ఈ నగరాలు 25 శాతం జీడీపీ కలిగి ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరమని... ఎంపీలు ఈ విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఐఐఎం మంజూరుకు విజ్ఞప్తి చేయాలని సీఎం సూచించారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్–I స్వాధీనం, మెట్రో ఫేజ్–II విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని సీఎం ఎంపీలకు వివరించారు. ఇందుకు సంబంధించి SBICAPSని కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని ఎంపీలకు సీఎం సూచించారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో 95 శాతం భూ సేకరణ పూర్తయిందని.. ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపాల్సి ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు.

మూసీ పునరుజ్జీవనం పనుల్లో మొదటి దశ టెండర్ల దశకు వచ్చిందని సీఎం తెలిపారు. ఈ పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఎంపీలు ఈ విషయంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని సూచించారు.అంతరాష్ట్ర నదీ జలాల విషయమై ఇటీవల కర్ణాటకలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులతో చర్చించిన అంశాలను సీఎం ఎంపీలకు వివరించారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావల్సి ఉన్నా పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. డ్యామ్‌తో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటక సహకరించేలా ఒప్పించాలని సీఆర్ పాటిల్‌ను కోరామని, ఈ విషయంపైనా ఎంపీలు కేంద్ర మంత్రిని కలవాలని సీఎం సూచించారు.నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందని సీఎం తెలిపారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్‌కు 300 టీఎంసీల వాటా ఉందని, వాటిని ఛత్తీస్‌గఢ్ వాడుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయన్నారు. అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. గోదావరి నుంచి ఏపీ ప్రాంతం మీదుగా తమిళనాడు, కర్ణాటక, కేరళకు నీరు తీసుకెళ్లే గోదావరి–కావేరి అనుసంధానం ఉందన్నారు. ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. ఇక్కడ నీళ్లు ఛత్తీస్‌గఢ్‌వి అయితే నిధులు కేంద్రానివని... ఆ రెండింటిని తెలంగాణకు అనుకూలంగా సాధించాలని సీఎం అన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) ఇవ్వాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డితెలిపారు. ఈ విషయంపైనా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చర్చించామన్నారు. వారు సూత్రప్రాయంగాఅంగీకరించారని, ఎన్‌వోసీలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని సీఎం అన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150–151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సీఎం అన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లకు సంబంధించి ఎలైన్‌మెంట్లు కొలిక్కివచ్చాయని సీఎం తెలిపారు. ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామని సీఎం తెలిపారు. ఈ ఎయిర్‌పోర్టుల్లో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్), ఎయిర్ కార్గోలు ఏర్పాటుచేయాలని కోరుతున్నామని.. ఈవిషయంపైనా ఎంపీలు దృష్టిసారించాలని సీఎం కోరారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సహకరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీలకు అతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందించడానికి ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కోఆర్డినేషన్ కు ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించామని సీఎం చెప్పారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నాఎంపీలు ఆయన దగ్గర నుంచి తీసుకోవచ్చని సూచించారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎంపీలు అడిగే సమాచారం వేగంగా వారికి అందజేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఎంపీల కన్వీనర్ డాక్టర్ మల్లు రవికి సీఎం సూచించారు.

సమావేశంలో ఎంపీలు అడిగిన ప్రతి సమాచారం అందజేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా తాము కేంద్ర ప్రభుత్వంతో సహకార ధోరణితోనే ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన వివిధ అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి గతంలో పంపిన లేఖలు, ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ లేఖలు సిద్ధం చేసి పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు అందుబాటులో ఉంచాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

గద్వాల దగ్గర మూతపడిన ఆయిల్ మిల్లు పునరుద్ధరణపై ఎంపీ డాక్టర్ మల్లు రవి అధికారులను ప్రశ్నించారు. 7–8 నెలల్లో పునరుద్ధరణ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేయడానికి వీలుగా ఈ సమావేశాలు చాలా ముందుగా ఏర్పాటుచేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో పండే ధాన్యానికి తగిన మిల్లింగ్ సామర్థ్యం లేదని, స్టోరేజీ సమస్య ఉందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రొటోకాల్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీలంతా ఏదో ఒక స్టాండింగ్ కమిటీ, కన్సల్టెన్సీ కమిటీల్లో సభ్యులుగా ఉంటారని, ఆ సమాచారం తీసుకొని ఆయా అంశాలకు సంబంధించిన పెండింగ్ విషయాలు తెలియజేస్తే సమావేశాల్లో తాము చర్చించేందుకు వీలుంటుందని ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి డిజైన్లలోనే లోపాలున్నాయని.. ఈ అంశంపై నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేయించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, ఈటల రాజేందర్, కడియం కావ్య, రామసహాయం రఘురామిరెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చామల కిరణ్ కిమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బోనాల ఉత్సవాలు ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం

**హైదరాబాద్, వెలుతురు జూలై 13:**

తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలతో ప్రారంభం

జూలై 20, 21, 22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా 20న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం, 21 నా అమ్మవారికళ్యాణం, 22 నా రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది

ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం

ఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల తో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు

బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల కోసం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాన్స్‌కో, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, పౌర సరఫరాల శాఖ, టీజీఎస్ఆర్టీసీ, రైల్వే, సమాచార & పౌర సంబంధాల శాఖ, పురావస్తు శాఖతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దేవాలయాల వద్ద క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, భద్రత, ప్రత్యేక బస్సుల నిర్వహణ, పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలు వంటి అన్ని ఏర్పాట్లు త్వరైతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

పాత జిహెచ్ఎంసి పరిధిలోని 3427 దేవాలయాలకు ప్రభుత్వం బోనాల ఉత్సవాల నిమిత్తం 15 కోట్ల 5 లక్షల 41 వేల 150 రూపాయలు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారి ఆధ్వర్యంలో విడుదల చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

బోనాల సందర్భంగా గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ – పోచమ్మ, హరిబౌలిలోని అక్కన్న– మాదన్న దేవాలయం, కార్వాన్ దర్బార్ మైసమ్మ, లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి, చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, మీరాలం మండి శ్రీ మహంకాళి ఆలయాలతో పాటు నగరంలోని దాదాపు 30 ప్రధాన ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు, ఇతర ముఖ్య నేతలు అధికారులు, సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల అనంతరం ఫలహారం బండ్ల ఊరేగింపు జరగనుంది.

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, భక్తులు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేందుకు పోలీసు, ప్రభుత్వ శాఖల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు ఆర్టీసీ మహిళలకు ఉచిత

# పైసలు లేవంటూనే లక్షల కోట్ల ప్రాజెక్టులా?

**హైదరాబాద్ వెలుతురు జూలై 13:**

ప్రభుత్వం ఒకవైపు ఖజానాలో నిధులు లేవని చెబుతూనే మరోవైపు భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి డబ్బులు లేవని చెప్పే ప్రభుత్వం, లక్షల కోట్ల రూపాయలతో మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులను ఎలా చేపడుతోందని ప్రశ్నించారు.

ఫుట్‌బాల్ టోర్నీలు, ఇతర ప్రచార కార్యక్రమాల కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆ నిధులతో అనేక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు నిర్మించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చని సూచించారు.

పక్క రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు ప్రభుత్వ నిధులతో పూర్తి పేజీ ప్రకటనలు ఇవ్వడం, రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలును కూడా భారీ ప్రచార కార్యక్రమాలుగా మార్చడం ప్రజాధన దుర్వినియోగమేనని హరీశ్‌రావు ఆరోపించారు. రైతుబంధు నిధుల పంపిణీ సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన సభ కోసం వేలాది బస్సులు ఏర్పాటు చేసి భారీగా ఖర్చు చేశారని, అది కూడా ప్రభుత్వ ధనమేనని వ్యాఖ్యానించారు.

ఇలాంటి కార్యక్రమాలకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వం, రైతులకు, ఉద్యోగులకు, సంక్షేమ పథకాలకు మాత్రం నిధులు లేవని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజాధన వినియోగంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని, ఖజానాలో నిజంగా నిధుల కొరత ఉంటే భారీ ప్రాజెక్టులు, ప్రచార కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్న డబ్బు ఎక్కడి నుంచి వస్తోందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# బడి బతికితేనే భవిష్యత్తు తెలంగాణ

"మాట ఒకటి, చేత ఒకటా? విద్యారంగ బలోపేతం పేరుతో బడుల కుదింపు"

తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, "తరగతి గదిలోనే సమాజం రూపుదిద్దుకుంటుంది" అని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. జూన్ 17న రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామంలో `తెలంగాణ విద్యా - TVS-P` పాఠశాలను ప్రారంభిస్తూ ఈ మాటలు చెప్పారు. విద్య పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అని ప్రభుత్వం చెప్తోంది.

కానీ అదే జూన్ నెలలో ముఖ్యమంత్రి గారు చేసిన మరో రెండు ప్రకటనలు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తే మాటలకు చేతలకు పొంతన కుదరడం లేదు. జూన్ నెలలో `ది హిందూ` పత్రిక నిర్వహించిన చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలోని 7 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదిస్తాము అని సంచలన ప్రకటన చేశారు. అంటే దాదాపు 23 వేల పాఠశాలలను మూసివేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పినట్టే. ఇదే నెలలో ఢిల్లీలో జరిగిన `నీతి అయోగ్` సమావేశంలో మాట్లాడుతూ "దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది"అని ఉద్ఘాటించారు. మరి 23 వేల బడులు మూస్తే ఆ పునాది ఎలా బలపడుతుంది? ఇదే ప్రశ్నను తెలంగాణలోని లక్షలాది తల్లిదండ్రులు, విద్యావేత్తలు,  అడుగుతున్నారు.

` ప్రభుత్వ పాఠశాలలు ఇప్పటికే మూతపడ్డాయి. ఇంకా 6000 పాఠశాలలు మూసేయడానికి ప్రతిపాదనలు ఫైనల్ దశలో ఉన్నాయి. మొత్తంగా 23 వేల పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీని వల్ల 8000 గ్రామాల్లో పాఠశాలలే లేకుండా పోయే ప్రమాదం ఉంది.

పాఠశాలల సంఖ్య తగ్గిస్తూనే 119 ఉపాధ్యాయ పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఒక ఉపాధ్యాయుడు మూడు నుండి నాలుగు తరగతులు చూసుకునే దుస్థితి ఉంది. బడుల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. మంచినీరు, మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ లేని బడులు వేలల్లో ఉన్నాయి.

నాణ్యత పెరిగిందా?

బడులు తగ్గిస్తే నాణ్యత పెరుగుతుందని ప్రభుత్వ వాదన. కానీ `NIRF` ర్యాంకింగ్ లు వేరే కథ చెప్తున్నాయి. NIRF ర్యాంకింగ్ లో తెలంగాణ 28వ స్థానం నుండి 20వ స్థానానికి పడిపోయింది. రాష్ట్రంలో 783 కళాశాలలు ఉంటే, 28 జిల్లాల నుండి కేవలం 300 నుండి 675 ర్యాంకుల్లోనే ఉన్నాయి. అంటే బడులు మూస్తే ర్యాంక్ రావడం లేదు సరికదా, ఇంకా దిగజారుతోంది.

RTE 2009 కి తూట్లు

విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి పిల్లవాడికి తన ఇంటికి 1 కి.మీ లోపు ప్రాథమిక పాఠశాల ఉండాలి. కానీ "విలీనం" పేరుతో చిన్న బడులను మూసి పెద్ద బడుల్లో కలపడం వల్ల పిల్లలు ఇప్పుడు 3 నుండి 5 కి.మీ నడవాల్సి వస్తోంది. గ్రామీణ పేద తల్లిదండ్రులు ఆర్థికంగా అంత దూరం పంపలేక పిల్లలను బడి మాన్పిస్తున్నారు. ఫలితంగా డ్రాపౌట్ రేటు ప్రమాదకరంగా పెరుగుతోంది.

గురుకులాలు, `TVS-P` స్కూళ్లు బాగున్నాయి. కానీ అవి 10% మంది పిల్లలకు మాత్రమే. మిగిలిన 90% సామాన్య, పేద, గ్రామీణ పిల్లలకు దగ్గరలో బడి లేకపోతే వారి భవిష్యత్తు ఏమిటి? వారి చదువు ఎవరు బాధ్యత తీసుకుంటారు?

సూటిగా చెప్పాలంటే


విద్యారంగ బలోపేతం గురించి ప్రసంగాలు చేస్తూనే, ఆచరణలో ప్రభుత్వ విద్యను లక్షలాది విద్యార్థులకు, వేలాది గ్రామాలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ఇది బలోపేతం కాదు. ఇది ప్రభుత్వ విద్యను ప్రజలకు దూరం చేసే కార్యక్రమం. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు లబ్ది చేకూర్చే కుట్రగా దీన్ని చూడాల్సి వస్తోంది.

తెలంగాణ ఉద్యమం "నీళ్లు, నిధులు, నియామకాలు" కోసమే కాదు, "ప్రతి గ్రామానికి బడి" కోసం కూడా జరిగింది. "మా పిల్లలకు మంచి బడులు కావాలి" అని లక్షలాది మంది నినదించారు. ఇప్పుడు స్వరాష్ట్రంలోనే బడులు మూస్తుంటే ఇది ఆ త్యాగాలకు ద్రోహం కాదా?

1. 27 వేలను 4 వేలకు కుదించే ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలి. బడుల మూసివేత, విలీనం ప్రక్రియను పూర్తిగా ఆపాలి.
2. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలి. విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి పాటించాలి.
3. ప్రతి బడికి మౌలిక సదుపాయాలు కల్పించాలి. బడ్జెట్ లో విద్యకు కేటాయింపులు పెంచాలి.
4. RTE 2009 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. ప్రతి పిల్లవాడికి ఇంటి దగ్గర బడి హక్కును కాపాడాలి.
5. నాణ్యత పెంపునకు టీచర్ ట్రైనింగ్, సిలబస్ అప్డేట్, డిజిటల్ సదుపాయాలపై దృష్టి పెట్టాలి.

తరగతి గదిలోనేసమాజం రూపుదిద్దుకుంటుందని సీఎం గారు అన్నారు. మరి ఆ తరగతి గదినే మూసేస్తున్నారు. ఒక బడి మూతపడితే ఒక ఊరి భవిష్యత్ ఏమిటి?

ఒక తరమే చీకట్లోకి వెళ్తుంది.ప్రభుత్వం వెంటనే స్పందించి బడులను కాపాడాలి. ఎందుకంటే బడి



భూపతి వెంకటేశ్వర్లు  రాష్ట్ర అధ్యక్షుడు
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం

# తెలంగాణ వచ్చింది... ఉద్యమ కళాకారులకు న్యాయం ఎప్పుడు?

తెలంగాణ రాష్ట్ర సాధన భారత రాజకీయ చరిత్రలో ఒక అపూర్వ అధ్యాయం. దశాబ్దాల పాటు సాగిన ఈ ఉద్యమం కేవలం రాజకీయ నాయకుల పోరాటంతోనే విజయవంతం కాలేదు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు, మేధావులు, ప్రజా సంఘాలతో పాటు కళాకారులు కూడా ఈ ఉద్యమానికి ఆత్మగా నిలిచారు. తెలంగాణ మట్టిలో పుట్టిన జానపద గీతాలు ఉద్యమానికి ఊపిరి పోశాయి. బుర్రకథలు, ఒగ్గుకథలు, డప్పుల దరువులు, జానపద నృత్యాలు, వీధి నాటకాలు ప్రజల్లో తెలంగాణ ఆత్మగౌరవాన్ని రగిలించాయి. ఒక సభను విజయవంతం చేయాలన్నా, ఒక గ్రామంలో ఉద్యమ స్ఫూర్తిని నింపాలన్నా కళాకారులే ముందుండేవారు. వారి గళం వినిపించిన చోట ఉద్యమ జ్వాలలు మరింతగా వ్యాపించాయి.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో కళాకారులు తమ కళను కేవలం వినోద సాధనంగా కాకుండా ఉద్యమ ఆయుధంగా మలిచారు. రోజులు తరబడి ఇంటికి దూరంగా ఉండి గ్రామాలు, పల్లెలు, పట్టణాలు తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచారు. ఎన్నో సందర్భాల్లో ఆకలితోనే కార్యక్రమాలు నిర్వహించారు. పారితోషికం కోసం కాదు, తెలంగాణ కోసం పనిచేశారు. కుటుంబాల గురించి ఆలోచించకుండా, ఉపాధిని పక్కనబెట్టి, తెలంగాణ రాష్ట్ర సాధనే జీవిత లక్ష్యంగా భావించారు. చాలామంది పోలీసు కేసులు ఎదుర్కొన్నారు. కొందరు జైలు జీవితం గడిపారు. మరికొందరు ఆర్థికంగా పూర్తిగా దెబ్బతిన్నారు. అయినప్పటికీ వారి గొంతు ఆగలేదు. "జై తెలంగాణ" అనే నినాదాన్ని ప్రజల హృదయాల్లో నాటిన గొప్ప బాధ్యతను కళాకారులే నిర్వర్తించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజు ఈ కళాకారులందరిలో కొత్త ఆశలు చిగురించాయి. తమ త్యాగాలకు ప్రభుత్వం తప్పకుండా గుర్తింపు ఇస్తుందని, తమ జీవితాలు కూడా మారుతాయని నమ్మారు. రాష్ట్ర సాధనలో తమ పాత్రను చరిత్ర గౌరవిస్తుందని భావించారు. ఉద్యమ కాలంలో అన్ని రాజకీయ పార్టీలు కూడా కళాకారుల సేవలను ప్రశంసించాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారికి తగిన గౌరవం, ఉపాధి, సంక్షేమం కల్పిస్తామని ఎన్నో హామీలు ఇచ్చాయి.

కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఆశల్లో చాలా వరకు నెరవేరలేదు. ఉద్యమం విజయవంతం అయిన తర్వాత వేదికలపై చప్పట్లు కొట్టిన సమాజం, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఉద్యమ కళాకారుల సమస్యలను అదే స్థాయిలో పట్టించుకోలేకపోయాయనే విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. ఉద్యమ సమయంలో ప్రజలను చైతన్యపరిచిన గొంతులు నేడు తమ జీవితాల కోసం ప్రభుత్వాల ఎదుటే న్యాయం కోరాల్సిన పరిస్థితి రావడం విచారకరం.నిజానికి ఉద్యమం అనేది కేవలం నాయకుల ప్రసంగాలతో మాత్రమే ముందుకు సాగదు. ప్రజల మనసులను కదిలించే సాంస్కృతిక శక్తి కూడా అవసరం. తెలంగాణ ఉద్యమంలో ఆ బాధ్యతను కళాకారులు అద్భుతంగా నిర్వర్తించారు. ఉద్యమ గీతాలు వినగానే వేలాది మంది యువకులు ఉద్యమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో రాజకీయ చర్చలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ భావజాలం ఇంటింటికీ చేరింది. ప్రజల్లో స్వీయగౌరవ భావన బలపడింది. ఉద్యమానికి సామాజిక బలం పెరిగింది. అందుకే తెలంగాణ ఉద్యమ చరిత్రను రాసేటప్పుడు కళాకారుల పేర్లను విస్మరించడం అసాధ్యం.

అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత అదే కళాకారులు ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగించడం, తమ కుటుంబాలను పోషించడానికి చిన్న చిన్న పనులు చేసుకోవాల్సి రావడం బాధాకరమైన వాస్తవం. ఉద్యమ సమయంలో వేలాది మందిని ఉత్తేజపరిచిన గాయకుడు నేడు వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడటం, ఒకప్పుడు సభలను ఊపేసిన కళాకారుడు నేడు జీవనోపాధి కోసం కూలి పనులకు వెళ్లాల్సి రావడం తెలంగాణ సమాజం ఆలోచించాల్సిన అంశం.రాష్ట్రం కోసం తమ జీవితాలను అంకితం చేసిన కళాకారుల పట్ల కృతజ్ఞత చూపించడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సమాజం మొత్తానిదీ. కానీ ప్రభుత్వం ముందుండి వారికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. ఉద్యమానికి పునాది వేసిన వారిని విస్మరిస్తే, భవిష్యత్ తరాలకు అది తప్పు సంకేతాన్ని ఇస్తుంది. త్యాగాలను గౌరవించని సమాజం చరిత్రలో గొప్ప స్థానాన్ని సంపాదించలేదు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టాలంటే ఉద్యమ కళాకారుల జీవితాల్లో కూడా వెలుగు నింపాల్సిన సమయం ఆసన్నమైంది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులు తమ త్యాగాలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశించారు. అయితే కాలం గడిచే కొద్దీ ఆ ఆశలు ఒక్కొక్కటిగా ఆవిరయ్యాయి. ఉద్యమం విజయవంతం కావడానికి తమ గళాన్ని ఆయుధంగా మలిచిన కళాకారులు నేడు తమ హక్కుల కోసం ప్రభుత్వాల ఎదుటే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది వ్యక్తుల సమస్య మాత్రమే కాదు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి సంబంధించిన అంశం కూడా.గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయంగా గొప్పగా ప్రస్తావించినప్పటికీ, ఉద్యమ కళాకారుల సంక్షేమానికి సంబంధించి ఆశించిన స్థాయిలో శాశ్వత విధానాలను అమలు చేయలేదనే విమర్శలు ఇప్పటికీ వినిపిస్తున్నాయి. కొందరికి అవకాశాలు లభించినా, వేలాది మంది గ్రామీణ కళాకారులు మాత్రం ప్రభుత్వ గుర్తింపుకు దూరంగానే మిగిలిపోయారు. ఉద్యమ సమయంలో ప్రతి సభలో వినిపించిన వారి గళం, రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికార వ్యవస్థలో వినిపించకపోవడం బాధాకరమైన వాస్తవం.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టో ఉద్యమ కళాకారుల్లో కొత్త ఆశలను రేకెత్తించింది. తెలంగాణ ఉద్యమంలో సేవలందించిన కళాకారులకు గౌరవప్రదమైన జీవితం కల్పిస్తామని, అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చింది. ఉద్యమంలో పాల్గొన్న కళాకారులను ప్రత్యేకంగా గుర్తించి వారి సేవలకు తగిన గౌరవం అందిస్తామని ప్రకటించింది. ఈ హామీలను విశ్వసించిన అనేక మంది కళాకారులు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం ఉంచారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, కళాకారులు ఆశించిన స్థాయిలో హామీల అమలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో తమను కలిసిన నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు దూరమయ్యారని ప్రశ్నిస్తున్నారు. ఉద్యమ కళాకారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, వారి సమస్యలను అధ్యయనం చేయడం, సమగ్ర సంక్షేమ విధానాన్ని ప్రకటించడం వంటి చర్యలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో కనిపించడం లేదని వారు అంటున్నారు.నేడు ఉద్యమ కళాకారుల జీవితాల్లో అనిశ్చితి కొనసాగుతోంది. వయసు పైబడిన వారు కళాప్రదర్శనలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. అనేక మంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. స్థిరమైన ఆదాయం లేక కుటుంబ పోషణ కూడా భారంగా మారింది. తెలంగాణ కోసం అహర్నిశలు తిరిగిన వారు, ఇప్పుడు కనీస జీవన భద్రత కోసం ప్రభుత్వాన్ని వేడుకోవాల్సిన పరిస్థితి రావడం అత్యంత విచారకరం.ఎన్నికల హామీలు ప్రజాస్వామ్యంలో విశ్వాసానికి ప్రతీక. వాటిని అమలు చేయడం ప్రభుత్వ నైతిక బాధ్యత. ముఖ్యంగా ఉద్యమాల్లో పాల్గొన్న వర్గాలకు ఇచ్చిన హామీలు మరింత బాధ్యతతో అమలు కావాలి. ఎందుకంటే వారు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు, సమాజం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం తమ జీవితాలను అంకితం చేశారు. అలాంటి వారిని విస్మరించడం కేవలం రాజకీయ వైఫల్యం మాత్రమే కాదు, చారిత్రక బాధ్యతను విస్మరించినట్లే.నేడు ఉద్యమ కళాకారులు అడుగుతున్న ప్రశ్నలు చాలా సహజమైనవే. "మా త్యాగాలకు గుర్తింపు ఎక్కడ?", "ఎన్నికల హామీలు ఎప్పుడు అమలు అవుతాయి?", "మా కుటుంబాలకు భరోసా ఎప్పుడు లభిస్తుంది?" అనే ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఎందుకంటే తెలంగాణ ఉద్యమ చరిత్రలో కళాకారుల పాత్రను ఎవరూ విస్మరించలేరు. ఆ చరిత్రకు గౌరవం ఇవ్వాలంటే, ఆ చరిత్రను సృష్టించిన మనుషులకు ముందుగా న్యాయం జరగాలి.

ఉద్యమ కళాకారులకు న్యాయం చేయడం అనేది కేవలం ఆర్థిక సహాయం అందించే అంశం కాదు. అది తెలంగాణ సమాజం తన చరిత్రకు, తన ఆత్మగౌరవానికి ఇచ్చే గౌరవం. రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన కళాకారులను గుర్తించడం అంటే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని సజీవంగా ఉంచడమే. అందుకే ప్రభుత్వం తక్షణమే ఉద్యమ కళాకారుల కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

మొదటిగా, తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కళాకారుల పూర్తి వివరాలతో పారదర్శకమైన జాబితాను రూపొందించాలి. వారి సేవలను నిర్ధారించేందుకు స్పష్టమైన ప్రమాణాలను రూపొందించి, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇవ్వాలి. ఆ గుర్తింపు కేవలం ఒక ప్రశంసాపత్రంగా కాకుండా, వారి జీవితానికి భరోసా కల్పించే విధంగా ఉండాలి.

వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమ కళాకారులకు గౌరవప్రదమైన నెలవారీ పింఛన్ అందించాలి. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్యసేవలు, ఆరోగ్య బీమా కల్పించాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు గృహ సదుపాయం, పిల్లలకు విద్యా సహాయం, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందించాలి. అర్హత కలిగిన వారికి ప్రభుత్వ శాఖలు, సాంస్కృతిక సంస్థలు, అకాడమీలు, విద్యాసంస్థల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించాలి. ఉద్యమ గీతాలు, జానపద సంపద, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు ఉద్యమ కళాకారుల అనుభవాన్ని వినియోగించాలి.జిల్లా, మండల స్థాయిల్లో సాంస్కృతిక వేదికలను బలోపేతం చేసి, ఉద్యమ కళాకారులకు నిరంతర ప్రదర్శన అవకాశాలు కల్పించాలి. వారిని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే సాంస్కృతిక, చరిత్ర కార్యక్రమాలకు ఆహ్వానించి, తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రత్యక్షంగా భావితరాలకు పరిచయం చేసే అవకాశం కల్పించాలి. దీంతో కళాకారులకు గౌరవం పెరగడమే కాకుండా, యువతలో తెలంగాణ చరిత్ర పట్ల అవగాహన కూడా పెరుగుతుంది.

ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై స్పష్టమైన కాలపట్టికను ప్రకటించాలి. హామీలు అమలులో ఎక్కడ ఉన్నాయో ప్రజలకు తెలియజేయాలి. ఉద్యమ కళాకారుల ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను ప్రత్యక్షంగా వినాలి. సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి. ఇది ప్రభుత్వం మరియు కళాకారుల మధ్య విశ్వాసాన్ని మరింతబలపరుస్తుంది.ప్రజాస్వామ్యంలో ఉద్యమాలు చరిత్రను మార్చుతాయి. కానీ ఆ ఉద్యమాలను ముందుకు నడిపించిన వారిని చరిత్ర మరచిపోతే, అది సమాజం చేసిన పెద్ద తప్పుగా మిగిలిపోతుంది. తెలంగాణ ఉద్యమం ఒక రాజకీయ విజయం మాత్రమే కాదు; అది వేలాది మంది త్యాగాల ఫలితం. ఆ త్యాగాల్లో ఉద్యమ కళాకారుల పాత్రను ఎంత చెప్పినా తక్కువే. వారి పాటలు ప్రజల్లో ఆశను నింపాయి. వారి గళం తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసింది. వారి కళ ఉద్యమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లింది.ఇప్పుడు అదే కళాకారులు ప్రభుత్వాన్ని చూస్తూ "మాకు ఇచ్చిన హామీలు ఎక్కడ?" అని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నకు సమాధానం మాటల్లో కాదు, చేతల్లో కనిపించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలైతేనే ప్రజాస్వామ్యంపై విశ్వాసం నిలుస్తుంది. ఉద్యమ కళాకారులకు న్యాయం జరిగితేనే తెలంగాణ ఉద్యమం తన పూర్తి అర్థాన్ని సంతరించుకుంటుంది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అధికారాలు మారాయి. పాలకులు మారారు. కానీ ఉద్యమ కళాకారుల జీవితాల్లో మార్పు రావాల్సిన సమయం ఇంకా రాలేదనే భావన సమాజంలో నెలకొనడం ఆందోళన కలిగించే విషయం. ఈ పరిస్థితిని మార్చడం ప్రభుత్వ బాధ్యత. ఉద్యమాన్ని గెలిపించిన గళాలకు గౌరవం ఇవ్వడం, వారి త్యాగాలను గుర్తించడం, వారి కుటుంబాలకు భరోసా కల్పించడం ద్వారా మాత్రమే తెలంగాణ తన ఉద్యమ చరిత్రకు నిజమైన నివాళి అర్పించిన రాష్ట్రంగా నిలుస్తుంది.తెలంగాణ సాధన కోసం మారుమోగిన ఆ గొంతులు నేడు న్యాయం కోరుతున్నాయి. ఆ గళాన్ని వినడం ప్రభుత్వం బాధ్యత... ఆ త్యాగాన్ని గౌరవించడం తెలంగాణ సమాజం ధర్మం.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com